PRAJASAKTI Regd.No. 15795/68

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 56 | విజయవాడ, గురువారం 26 సెప్టెంబర్ 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 26 September 2024 | Rs

సిటీ

## అడ్డగోలు పెట్రో దోపిడి..!

- భారత్‌లో హెచ్చు ధరలు కొనసాగింపు
- 70 డాలర్లకు తగ్గిన ముడి చమురు
- ప్రజలపై రూ.2 లక్షల కోట్ల భారం

3

## ఎర్రమట్టి దిబ్బల్ని తవ్వొద్దు : హైకోర్టు

**ప్రజాశక్తి-అమరావతి**

విశాఖ జిల్లా, భీమునిపట్నం మండలం, నేరెళ్లవలసలో ఎర్రమట్టి దిబ్బల తవ్వకాల పనులను నిలిపివేయాలన్న తమ ఉత్తర్వులను అమలు చేయాలని గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జివిఎంసి)ను హైకోర్టు ఆదేశించింది. జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ దాఖలు చేసిన పిల్ పై చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం విచారణ జరిపింది. కౌంటర్లు దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వశాఖ కార్యదర్శి, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టరు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, గనులశాఖ ముఖ్య కార్యదర్శి, జివిఎంసి కమిషనర్, విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజినల్ డెవలప్‌మెంట్ అథారిటీ, జిల్లా కలెక్టరు, భీమునిపట్నం మ్యూచ్చువల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీలకు నోటీసులు జారీ చేసింది. విచారణను 8 వారాలకు వాయిదా వేసింది.

# వరద బాధితులకు రూ.602 కోట్లు

- నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ
- సమాచార పత్రాలు అందచేసిన చంద్రబాబు
- చిట్టచివరి బాధితుడికి సాయం అందిస్తాం
- రికార్డు స్థాయిలో విరాళాలు



విజయవాడలోని కలెక్టరేట్‌లో వరద బాధితులకు పరిహారం పంపిణీ సమాచార లేఖలను అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో, విజయవాడ**

బుడమేరు వరద బాధితులకు రూ.602 కోట్ల రూపాయల మేర పరిహారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పంపిణీ చేశారు. బుధవారం విజయడలోని జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో వరదబాధితులకు పరిహార పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ మొత్తాన్ని నేరుగా బాధితుల బ్యాంకు ఖాతాల్లో ఆయన జమచేశారు. పరిహారం పంపిణీకి సంబంధించిన సమాచార పత్రాలను బాధితులకు లాంఛనంగా అందచేశారు. ఈ సందర్భంగా వివిధ రకాల లైసెన్సులు లేని చిన్నచిన్న వ్యాపారాలను ఎన్యుమరేషన్‌లో పరిగణలోకి తీసుకోలేదని, వాటి యజమానులకు కూడా పరిహారం అందించాలని ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) చేసిన అభ్యర్థనకు సిఎం సానుకూలంగా స్పందించారు. అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ చిట్టచివరి బాధితుడికి కూడా సాయం అందించడం తమ లక్ష్యమని చెప్పారు. ఇంకా ఎవరైనా అర్హులుంటే ఈ నెల 30వ తేదీ నాటికి నివేదికను తయారు చేసి వారికి కూడా సాయం అందిస్తామని తెలిపారు. అత్యంత పారదర్శకంగా లబ్దిదారుల జాబితా ఎంపిక చేసి ఆ జాబితాలను సచివాలయాల్లో ప్రదర్శించినట్లు చెప్పారు. బాదితులకు హదుద్, తిత్లీ కంటే మెరుగైన ప్యాకేజీ ఇచ్చామన్నారు. దేశంలో ఎక్కడా ఇవ్వని విధంగా భారీ పరిహారాన్ని పక్షం రోజుల్లోనే అందించినట్లు చెప్పారు. వరదల వల్ల రాష్ట్రంలో మొత్తం రూ 7600 కోట్ల నష్టం వాటిల్లిందని చెప్పారు. ఒకే ప్రాంతంలో 42 సెంటీమీటర్ల వర్షపాతం నమోదవడంతో బుడమేరు ప్రాంతంలో ఎప్పుడూ లేనంతగా ఫ్లాష్ ఫ్లడ్స్ వచ్చిందని తెలిపారు. గతంలో బుడమేరు ఆధునికీకరణకు రూ 57 కోట్లు ఇస్తే గత ప్రభుత్వం నిర్లక్ష్యం, రాజకీయ వివక్షతో ఆ పనులను రద్దు చేసిందని తెలిపారు. 11.90 లక్షల క్యూసెక్కుల సామర్థ్యమున్న ప్రకాశం బ్యారేజీకి రికార్డు స్థాయిలో ఒక్కసారిగా 11.43 లక్షల క్యూసెక్కుల వరద వచ్చిందని చెప్పారు. ప్రమాద ప్రాంతాలకు తాను స్వయంగా నాలుగైదుసార్లు వెళ్లి పర్యవేక్షణ చేశానని, దీంతో అధికారులు మరింత బాధ్యతగా పనిచేశారని అన్నారు. వరద బాధితులను ఆదుకోవడానికి దాతలు స్పందించిన తీరు అపూర్వమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి సహాయనిధికి రికార్డుస్థాయిలో రూ 400 కోట్ల విరాళాలు వచ్చాయన్నారు. 'చిన్నా , పెద్ద అందరూ స్పందిచారు. వీల్‌ఛైర్‌లో సైతం వచ్చి విరాళాలు ఇచ్చారు. ఇప్పటి వరకు 602 కోట్ల రూపాయలు బాధితుల కోసం విడుదల చేశాం. ఇందులో 400 కోట్లు దాతలు ఇచ్చినవే. అందుకే దాతలందరికీ పాదాభివందనం చేస్తున్నా.' అని చంద్రబాబు అన్నారు.

**1.14 కోట్ల వాటర్ బాటిళ్లు ...**

వరద బాధితులకు 1.14 కోట్ల వాటర్ బాటిళ్లు పంపిణీ చేసినట్లు సిఎం చెప్పారు. అదే విధంగా 37 లక్షల లీటర్ల పాలు, 47 లక్షల బిస్కెట్ ప్యాకెట్లు, 5 లక్షల గుడ్లు పంపిణీ చేశామని తెలిపారు. అలాగే 1.15 కోట్ల ఆహార ప్యాకెట్లను, 5,000 క్వింటాళ్ల కూరగాయలను 2,45,000 మందికి నిత్యావసర సరుకులు పంపిణీ చేశామని తెలిపారు. ఫైర్ ఇంజిన్లను ఉపయోగించి దాదాపు 75 వేల ఇళ్లను, 330 కిలోమీటర్ల మేర రహదారులను, వీధులల్లోని బురదను శుభ్రం చేశామన్నారు. అలాగే వరదల్లో పేరుకుపోయిన 20 వేల మెట్రిక్ టన్నుల చెత్తను తరలించామన్నారు. వరద ప్రభావం 16 జిల్లాలోని 227 మండలాల్లోని 905 గ్రామాలు దెబ్బతిన్నాయన్నారు. రాష్ట్రం మొత్తం మీద 74 మంది మరణించారన్నారు.

## రాష్ట్రంలో మూడు ఇండస్ట్రియల్ కారిడార్లు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్రంలో మూడు ఇండస్ట్రియల్ కారిడార్ల ఏర్పాటుకు ఎపి ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ బోర్డు (ఎపిఐసిడిఎ) అంగీకారం తెలిపింది. ఎపిఐసిడిఎ ఛైర్మన్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన బోర్డు సమావేశం తొలిసారి బుధవారం సచివాలయంలో జరిగింది. వైజాగ్ చైన్నై ఇండస్ట్రియల్ కారిడార్ (విసిఐసి) (కృష్ణపట్నం నోడ్) పరిధిలో 10,834.50 ఎకరాలు, చెన్నై బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ (సిబిఐసి) ( ఓర్వకల్ నోడ్) పరిధిలో 9,718.84 ఎకరాలు, హైదరాబాద్ బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ (హెచ్‌బిఐసి) 'కొప్పర్తినోడ్ 6740.44 ఎకరాలు అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఈ మూడు కారిడార్లకు సంబంధించిన మాస్టర్ ప్లాన్లను కూడా బోర్డు అంగీకరించింది. ఈ కారిడార్ల పరిధిలోని ఇండస్ట్రియల్, రెసిడెన్షియల్, కమర్షియల్ లేఅవుట్లకు అనుమతులు ఇవ్వాలని తెలిపింది. వీటిని సమర్ధవంతంగా అమలు చేసేందుకు ఎపిఐసిడిఎ, మున్సిపల్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ, టౌన్ ప్లానింగ్, కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక, పారిశ్రామిక శాఖల మంత్రులు పయ్యావుల కేశవ్, టిజి భరత్, ఇంధన శాఖ, రెవెన్యూ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు కె విజయానంద్, ఆర్‌పి సిసోడియా, మున్సిపల్, పరిశ్రమల ముఖ్యకార్యదర్శులు ఎకె సింఘాల్, కె సునీత తదితరులు పాల్గొన్నారు.

# మత వైషమ్యాలు రెచ్చగొట్టొద్దు

**సామరస్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం చొరవ చూపాలి**

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు
- సిట్‌ను స్వాగతిస్తున్నాం, నిజాలు తేల్చాలి

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

తిరుమల లడ్డూ వివాదం నేపథ్యంలో రాష్ట్రంలో కొంతమంది ప్రజల మధ్య మత వైషమ్యాలు రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, అటువంటి వారిని అడ్డుకుని సామరస్య వాతావరణాన్ని కాపాడేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కోరారు. విజయవాడ బాలోత్సవ భవన్లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుపతి లడ్డూల కల్తీ విషయంలో, పాత వివాదాలు, అంశాల నేపథ్యంలో అక్రమాలను వెలికితీసేందుకు సిట్‌ను నియమించడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా తిరుపతిలో కొనుగోళ్లు, యాత్రికులకు పాసులు జారీ చేయడం, ఉద్యోగాలు ఇవ్వడం వంటి అంశాలలో అవినీతి పాతుకుపోయి ఉందని పేర్కొన్నారు. సిట్ నిష్పక్షపాతంగా వ్యవహరించి వాస్తవాలను వెలికితీయాలని కోరారు. భక్తులు కోరుకుంటున్నట్లుగా తిరుమలలో సామరస్య వాతావరణం వచ్చేట్లుగా చర్యలను సిఫారసు చేయాలని కోరారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ఒక బాధ్యతాయుత స్థానంలో ఉన్న పవన్‌కల్యాణ్ అవినీతి నిర్మూలనకు, భక్తులకు విశ్వాసం కలిగించేలా కాకుండా వివిధ మతాల మధ్య వైషమ్యాలు, ఉద్రిక్తతలు సృష్టించేలా వ్యాఖ్యలు చేస్తున్నారని, ఇది సరికాదని పేర్కొన్నారు. మతాల మధ్య అపోహలు సృష్టించేలా అధికారంలో ఉన్నవారే మాట్లాడితే అది ఆర్‌ఎస్‌ఎస్, సంఘ్‌పరివార్ వంటి మతోన్మాద శక్తులు విస్తరించడానికి తప్ప దేనికీ ఉపయోగపడదని అన్నారు. రాష్ట్రంలో లౌకిక వ్యవస్థను, విధానాలను కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని తెలిపారు. అయితే లడ్డూ విషయంలో తెలుగుదేశం, జనసేన, వైసిపి వైఖరి, బిజెపి, సంఘ పరివార్ శక్తులకు తోడ్పడేవిగా ఉన్నాయని అన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాల అనుభవం తీసుకున్నా మత విద్వేషాల విషయంలో బిజెపికి తోడ్పడిన ఏ ప్రాంతీయ పార్టీ కూడా ఉపయోగం పొందలేదని వివరించారు. ప్రాంతీయ పార్టీల తోడ్పాటు బిజెపికి అనుకూలంగా రాజకీయాలను మార్చాయని తెలిపారు. మహారాష్ట్రలో శివసేన, తమిళనాడులో అన్నాడిఎంకె అనుభవాలు కళ్లకు కనబడుతున్నాయని, లౌకిక పార్టీగా ఉన్న తెలుగుదేశం.. బిజెపి మాయలో పడి మతం పేరుతో ఉద్రిక్తతలు సృష్టించడానికి తోడ్పడడం ఆత్మహత్యాసదృశ్యం అవుతుందని అన్నారు. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న వైసిపి వాస్తవాలను బయటకు తీసుకురావడానికి ప్రయత్నించకుండా ప్రధానికే విన్నపాలు చేయడం పిట్ట మిగత 5లో

## ప్యాకేజి సాయం రూ.15.81 కోట్లే

- ప్రత్యేకహోదాకు బదులుగా కేంద్రం ఇచ్చింది ఇంతే!
- విభజన చట్టం కింద రూ.35 వేల కోట్లు

**ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి**

రాష్ట్రానికి న్యాయబద్ధంగా రావాల్సిన నిధులను విడుదల చేయడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనడానికి ప్రత్యేకహోదాకు బదులుగా ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజి కింద ఇచ్చిన నిధులే నిదర్శనం. హోదాకు బదులుగా రాష్ట్రానికి ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజి కింద కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు కేవలం 15.81 కోట్ల రూపాయలు మాత్రమే ఇచ్చింది. సమాచార హక్కు కార్యకర్త ఇనగంటి రవికుమార్ ఆ చట్టం కింద అడిగిన ప్రశ్నలకు కేంద్ర ఆర్థికశాఖలోని ఖర్చుల విభాగం ఈ మేరకు సమాధానం ఇచ్చింది. రాష్ట్రానికి ప్రత్యేక హెూదా కల్పించడం సాధ్యం కాదని, దానికి బదులుగా ప్రత్యేక ప్యాకేజి కిందసాయం అందచేస్తామని 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ప్రకటించింది. హోదాకన్నా ఎక్కువ మొత్తం ప్యాకేజిలో సాయం అందుతుందని అప్పట్లో బిజెపి నేతలు చెప్పారు. తాజాగా ఆర్థికశాఖ ఇచ్చిన సమాధానంతో ప్యాకేజి వల్ల రాష్ట్రానికి దక్కింది నామమాత్రపు మొత్తమేనని తేలింది. ఇది కాకుండా విభజన చట్టం కింద గడిచిన పదేళ్ల కాలంలో 35,492 కోట్ల రూపాయలు ఇచ్చినట్లు తెలిపింది. ఇందులో కూడా కేవలం రిసోర్స్ గ్యాప్ కింద రూ.16,079 కోట్లు, పోలవరం ప్రాజెక్టుకురు రూ.15,147 కోట్లు ఇచ్చినట్లు కేంద్రం పేర్కొంది. లోటు భర్తీ కింద తొలి మూడేళ్లపాటు మూడు వేల కోట్లవరకు ఇచ్చిన కేంద్రం తరువాత ఐదేళ్లపాటు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఎన్నికల కారణంగా గత ఆర్థిక సంవత్సరంలో మాత్రం రూ.10,461 కోట్లు ఇచ్చింది. రాజధాని నిర్మాణానికి కూడా తొలి మూడేళ్ల కాలంలో రూ.2,500 కోట్లు ఇచ్చిన కేంద్రం ఆ తరువాత ఒక్క పైసా కూడా విదల్చలేదు. వెనుకబడిన జిల్లాలకు పదేళ్లపాటు ఏటా 350 కోట్లు ఇవ్వాల్సి ఉండగా, కేవలం ఐదేళ్లు మాత్రమే రూ.1,750 కోట్లు ఇచ్చింది. 2017-18, 2018-19, 2021-22, 2022-23 సంవత్సరాల్లో ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు.

**విభజన చట్టం కింద ఇచ్చింది ఇంతే**

| రంగం | నిధులు (రూ. కోట్లలో) |
|---|---|
| రిసోర్స్ గ్యాప్ | 16,079 |
| వెనుకబడిన జిల్లాలు | 1,750 |
| రాజధాని నిర్మాణానికి | 2,500 |
| పోలవరం ప్రాజెక్టుకు | 15,147 |
| ఇఎపి రుణాలపై వడ్డీ | 16 |
| **మొత్తం** | **35,492** |

## మాజీ ఎంపి మాగుంట పార్వతమ్మ కన్నుమూత

**ప్రజజాశక్తి- నెల్లూరు ప్రతినిధి**



ఒంగోలు మాజీ ఎంపి మాగుంట పార్వతమ్మ (77) బుధవారం కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె చెన్నయ్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు. కావలి ఎంఎల్‌ఎగా కూడా ఆమె పనిచేశారు. ప్రముఖ వ్యాపారవేత్త, మాజీ ఎంపి అయిన ఆమె భర్త మాగుంట సుబ్బరామిరెడ్డి గతంలో మృతి చెందారు. వారి కుమారుడు విజయబాబు కూడా మరణించారు. కుమార్తె చెన్నయ్‌లో ఉంటున్నారు. పార్వతమ్మ అంత్యక్రియలు నెల్లూరులో గురువారం సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రకటించారు. పార్వతమ్మ మృతికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతాపం తెలిపారు.

# రాష్ట్రాభివృద్ధికి రూట్ మ్యాప్

- ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సమ్మిట్‌లో మంత్రి లోకేష్




సమ్మిట్‌లో మాట్లాడుతున్న మంత్రి నారా లోకేష్

**ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో**

రాష్ట్రాన్ని 2047 నాటికి దేశంలో నెంబర్ 1 అభివృద్ధి చేయడానికి రూట్ మ్యాప్ సిద్ధం చేసినట్టు రాష్ట్ర విద్య, ఐటి మౌలిక సదుపాయాల శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఉత్తరాంధ్రను అతిపెద్ద ఫార్మా హబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. బుధవారం విశాఖలోని నోవటల్ హోటల్‌లో భారత పారిశ్రామల సమాఖ్య (సిఐఐ) ఆధ్వర్యాన జరిగిన ఎపి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సమ్మిట్-2024కు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనూ, దేశంలోనూ పెట్టుబడిదారులంతా చంద్రబాబు 2024 ఎన్నికల్లో అధికారంలోకి రావాలని బలంగా భావించారని అన్నారు. 2019-2024 మధ్య కాలంలో బయటకుపోయిన వారంతా ఇప్పుడు రాష్ట్రానికి వస్తున్నారని తెలిపారు. త్వరలోనే ఐటి, పారిశ్రామిక పాలసీని రూపొందించి 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. విశాఖకు ఎప్పుడూ తమ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని చెప్పారు. మరిన్ని పెట్టుబడులు విశాఖకు రానున్నాయని తెలిపారు. అభివృద్ధి వికేంద్రీకరణ తమ విధానమన్నారు. రాష్ట్రంలో ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు (ఇడిబి)ను ఏర్పాటు చేసి శాఖల ప్రగతిని సమీక్షిస్తామని, సిఎం చంద్రబాబు పర్యవేక్షణలో ఇది నడుస్తుందని తెలిపారు. రాష్ట్రంలో వచ్చే ఐదేళ్లలో సాధించనున్న ప్రగతిని వివరించారు. గోదావరి జిల్లాల్లో గ్రీన్ ఎనర్జీ రంగాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. దేశంలోనే అతిపెద్ద పెట్రో కెమికల్ కారిడార్ గోదావరి ప్రాంతంలో రాబోతుందని తెలిపారు. విద్యుదుత్పత్తి 72 గిగావాట్లు సాధించాలన్న లక్ష్యంతో హైడ్రో, విండ్, సోలార్ ప్రాజెక్టులను రాష్ట్రమంతటా నెలకొల్పుతామన్నారు. సమ్మిట్‌కు రాష్ట్ర ఆర్ అండ్ బి, మౌలిక వసతులు, పెట్టుబడుల శాఖ మంత్రి జనార్ధన్‌రెడ్డి, సిఐఐ ఎపి శాఖ చైర్మన్ వి.మురళీకృష్ణ, జిఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ బిజినెస్ చైర్మన్ జిబిఎస్.రాజు అతిథులుగా పాల్గొన్నారు. ఓపెన్ సెషన్ అనంతరం పెట్టుబడిదారులతోనూ లోకేష్ భేటీ అయ్యారు.

**విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై చర్చే లేదు**

'వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మేం మొదటి నుంచీ మాట్లాడుతున్నాం. ఉక్కు ప్రైవేటీకరణపై అసలు చర్చేలేదు. వైసిపి హయాంలో ఉక్కు పరిశ్రమను పట్టించుకోలేదు. పైగా ఇప్పుడు దుష్ప్రచారం సాగిస్తున్నారు' అని లోకేష్ అన్నారు. ఎపి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సమ్మిట్-2024లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఇంకెక్కడ ఉక్కు ప్రైవేటీకరణ, మా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ప్లాంట్ ప్రైవేటీకరణ కాదని ప్రకటించేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర పెద్దలతో మాట్లాడారు. అసలు ఉక్కు ప్రైవేటీకరణపై చర్చ ఎక్కడుంది?' అని చెప్పుకొచ్చారు. కేంద్రం ఇటీవల రూ.500 కోట్లు గ్రాంట్ కూడా ఇచ్చిందన్నారు. జగన్ హయాంలో ఒక్క రూపాయి అయినా స్టీల్‌ప్లాంట్‌కు వచ్చిందా? అని ప్రశ్నించారు. రాబోయే వంద రోజుల్లో ఐటి పాలసీ తీసుకొచ్చి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తామని, అదానీ డేటా సెంటర్‌ను విశాఖలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాగల ఐదేళ్లలో 20 వేల ఉద్యోగాలు విశాఖలో కల్పించనున్నామని చెప్పారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు అవకాశాలపై త్వరలో క్షేత్రస్థాయిలో తాను పారిశ్రామికవేత్తలతో పర్యటనలకు వెళ్లనున్నట్లు తెలిపారు.

## 28న ఆలయాల్లో పూజలు

- వైఎస్ జగన్ పిలుపు
- అదే రోజు తిరుమలకు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో/ తిరుమల**

రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాల్లో ఈ నెల 28 వ తేది పూజలు నిర్వహించాలని మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఎక్స్‌లో బుధవారం ఆయన పోస్టుచేశారు. తిరుమల పవిత్రతకు చంద్రబాబు భంగం కలిగించారని, ఆయన చేసిన పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు 28వ తేది రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాల్లో పూజలు నిర్వహించాలని కోరారు. దుర్భిద్ధితోనే చంద్రబాబు అబద్ధాలు ఆడుతున్నారని, కల్తీ జరగకుండానే జరిగిందని చెబుతున్నారని పేర్కొన్న ఆయన వైఎస్‌ఆర్‌సిపి నేతలందరూ ఈ పూజ కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మరోవైపు అదే రోజు ఆయన తిరుమలకు వెడుతున్నారు. 27వ తేదీ శుక్రవారం రాత్రికి ఆయన తిరుమల చేరుకుంటారని, మరుసటి రోజైన శనివారం వెంకటేశ్వరుని దర్శించుకుంటారని వైసిపి కార్యాలయ వర్గాలు తెలిపాయి.

### క్రూర మృగాలు, వీధి పశువుల బెడద నివారించాలని కోరుతూ

# పార్లమెంటు స్ట్రీట్ వద్ద ధర్నా

- ఎలిఫెంట్ కారిడార్లు, టైగర్ రిజర్వ్‌ల పేరుతో తొలగింపులు ఆపాలి
- పశువుల వ్యాపారంపై ఆంక్షలు ఎత్తివేయాలి
- ఎఐకెఎస్, ఎఐఎడబ్ల్యుయు డిమాండ్




ఢిల్లీలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న కిసాన్ సభ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

మానవ, వన్యప్రాణుల సంఘర్షణను, వీధుల్లో విచ్చలవిడిగా తిరుగుతున్న ఎద్దులు, దున్నల బెడదను నివారించాలని కోరుతూ అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్), అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయు) బుధవారం నాడిక్కడ పార్లమెంట్ స్ట్రీట్ వద్ద ధర్నా నిర్వహించాయి. వన్య ప్రాణులు, వీధి పశువుల బారి నుండి పంటలను, జీవనోపాధిని పరిరక్షించాలంటూ నిరసనకారులు బిగ్గరగా నినదించారు. ఎలిఫెంట్ కారిడార్లు, టైగర్ రిజర్వ్‌ల పేరుతో తొలగింపులు ఆపాలని, పశువుల వ్యాపారంపై ఆంక్షలను ఎత్తివేయాలని నినదించారు. కేరళ, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, తమిళనాడు, కర్ణాటక, జార్ఖండ్, తెలంగాణ, యుపి, ఢిల్లీ తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన వందలాది మంది రైతులు ఈ ధర్నాలో పాల్గొన్నారు. ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్ ధర్నాను ప్రారంభించగా, ఎఐకెఎస్ అధ్యక్షులు అశోక్ ధావలే, ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి వెంకట్, ఎఐఎడబ్ల్యుయు సహాయ కార్యదర్శి, రాజ్యసభ సభ్యులు వి శివదాసన్, ఎఐకెఎస్ తమిళనాడు ఉపాధ్యక్షులు, లోకసభ సభ్యులు ఆర్ సచ్చితానందం ప్రధాన వక్తలుగా మాట్లాడారు. ఎఐకెఎస్ ఉపాధ్యక్షులు హన్నన్ మొల్లా, ఎఐఎడబ్ల్యుయు సహాయ కార్యదర్శి విక్రమ్ సింగ్, ఎఐకెఎస్ ఆర్థిక కార్యదర్శి పి కృష్ణప్రసాద్, కేరళ కర్షక సంఘం కార్యదర్శి, ఎఐకెఎస్ సంయుక్త కార్యదర్శి వల్సన్ పనోలి, వివిధ రాష్ట్రాలకు చెందిన నాయకులు ధర్నాలో ప్రసంగించారు. ఎఐకెఎస్, ఎఐఎడబ్ల్యుయు ప్రతినిధుల బృందాన్ని కలుసుకునేందుకు పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి అంగీకరించారు.

**డిమాండ్లు**

- భారతీయ అటవీ చట్టం-1927, వన్యప్రాణుల రక్షణ చట్టం-1972, అటవీ సంరక్షణ చట్టం-1980లను వన్యప్రాణుల బారి నుండి మానవ ప్రాణ, ఆస్తి, జీవనోపాధికి రక్షణ కల్పించేందుకు, అలాగే వన్యప్రాణుల సంరక్షణ, వాటి ఉనికిని కాపాడడం కోసం ప్రత్యేకంగా చట్టాలు తీసుకురావాలి.
- క్రిములు, స్టెరిలైజేషన్, వీధి జంతువుల బెదిరింపులను నియంత్రించడానికి శాస్త్రీయంగా చంపడం సహా ఇతర చర్యలను ప్రకటించే రాష్ట్రాల హక్కులకు హామీ ఉందని నిర్ధారించాలి. షెడ్యూల్ జంతువుల జాబితా నుండి అడవి మిగత 5లో




## ఎఆర్ డెయిరీపై టిటిడి ఫిర్యాదు

**ప్రజాశక్తి- తిరుమల**

లడ్డూ తయారీ కోసం టిటిడికి సరఫరా చేసిన నెయ్యిలో ఎఆర్ డెయిరీ కల్తీకి పాల్పడిదంటూ తిరుమల ఈస్టు పోలీస్ స్టేషన్లో టిటిడి మార్కెటింగ్ విభాగం ప్రొక్యూర్‌మెంట్ జిఎం మురళీకృష్ణ బుధవారం ఫిర్యాదు చేశారు. పది లక్షల కేజీల నెయ్యి సరఫరా చేయాలని కోరుతూ ఆ డెయిరీకి ఈ ఏడాది మే 15న ఆర్డరు ఇచ్చామని తెలిపారు. జులై 6, 12 తేదీల్లో సరఫరా చేసిన నాలుగు ట్యాంకర్ల నెయ్యిని ఎన్‌డిబిఎల్ ల్యాబ్‌కు పరీక్షల నిమిత్తం పంపామని, ఈ నెయ్యిలో వెజిటబుల్, అనిమల్ ఫ్యాట్ కల్తీ జరిగినట్లు రిపోర్ట్ వచ్చిందని ఈ ఫిర్యాదులో పేర్కొన్నారు. కల్తీ నెయ్యి సరఫరా చేసిన ఎఆర్ డెయిరీపై కేసు నమోదు చేయాలని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తిరుపతి ఈస్ట్ డిఎస్‌పి వెంకటనారాయణను ఆయన కోరారు. పోలీసులు 470 ఆఫ్ 22 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు.

100 రోజుల్లో

# రాష్ట్రానికి కేంద్రం ఒరగబెట్టిందేమీ లేదు

- అమరావతికి అప్పుకిందే రూ.15 వేల కోట్లు
- ఉక్కు ఫ్యాక్టరీని కాపాడేందుకు రోడ్ మ్యాప్ ప్రకటించాలి
- ఎమ్మెల్యేలు మారారు తప్ప ఇసుక ధర మారలేదు : వి శ్రీనివాసరావు



ప్రధానమంత్రి మోడి, ముఖ్యమంత్రి చంద్రబాబు ( ఫైల్ ఫోటో)

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో మిత్రులే అధికారంలోకి వచ్చినా రాష్ట్రానికి కేంద్రం ఒరగబెట్టిందేమీ లేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం బాలోత్సవ భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 23, 24 తేదీల్లో విజయవాడలో జరిగిన సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాల్లో రాష్ట్ర పరిస్థితులపై సమీక్ష చేసినట్లు పేర్కొన్నారు. అమరావతికి సహాయం చేస్తున్నట్లుగా బడ్జెట్లో గొప్పలు చెప్పిన కేంద్రం ఇప్పుడు ప్రపంచ బ్యాంకు బృందాలను పంపించి అప్పు తీసుకోమంటున్నారని, మధ్యవర్తులుగా ఉండి అప్పు ఇప్పిస్తామంటున్నారని తెలిపారు. ఆ అప్పు తీర్చే బాధ్యత రాష్ట్రానిదేనని, భారం ప్రజలపైనే పడుతుందని చెప్పారు. ఇందులో కేంద్రం చేస్తున్న సహాయం ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వంపై, ప్రజలపై భారం పడకుండా కేంద్రమే సహాయం చేయాలని ఆయన కోరారు. టిడిపి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధికి కేంద్రమే బాధ్యత తీసుకుని అప్పు కూడా వారే తిరిగి చెల్లించేలా ఒప్పించాలని కోరారు. వెనుకబడిన ప్రాంతాలకు నిధులు కేటాయిస్తామని బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించినా, దానికి సంబంధించి ఎటువంటి కదలికా లేదని చెప్పారు. ఇప్పటి వరకు ఒక్కపైసా కేటాయించలేదని, కేవలం ప్రజలను మభ్యపెట్టడం తప్ప చర్యలు లేవని అన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ విషయంలో కూడా కేంద్రం మోసపూరిత వైఖరిని అవలంభిస్తోందని పేర్కొన్నారు. ప్రైవేటీకరణ జరగకుండా చూస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారని, దానికి అనుగుణంగా రోడ్ మ్యాప్ రూపొందించాలని డిమాండ్ చేశారు. దానికి తగిన యంత్రాంగాన్ని ఏర్పాటు చేసి వారు నిరంతరం ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ కాకుండా కాపాడేందుకు పనిచేయాలన్నారు. అలా చేయకుండా రాష్ట్ర ప్రభుత్వమూ కేంద్రానికి భజన చేసే విధంగా వ్యవహరిస్తోందన్నారు. 'నేను మారాను' అని సిఎం చంద్రబాబు, 'మేము మార్పు చూపిస్తాం' అని మంత్రులందరూ చెబుతున్నా ఆచరణలో ప్రజలు ఆశించినంతగా మార్పు కనబడడం లేదని అన్నారు. ఉచిత ఇసుక ఇస్తామన్నా రకరకాల పేర్లతో గత ప్రభుత్వ హయాం కన్నా ధర పెరిగిందని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యేలు, పెత్తందారుల ఆధిపత్య పోరు పెరిగిపోతోందన్నారు. ఆ పార్టీ వ్యక్తుల బదులు ఈ పార్టీ వ్యక్తులు వస్తున్నారు తప్ప తేడా ఏమీ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం మీద దందా, ట్రాన్స్‌ఫర్ల కోసం, అధికారుల అపాయింట్‌మెంట్ల కోసం ముడుపులు వంటి విషయాల్లో ఏమీ మార్పులేదని అన్నారు. మార్పు చూపాలంటే అవినీతిని నిరోధించాలని తెలిపారు. సూపర్ సిక్స్ అమలు కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని, పెన్షన్ తప్ప ఇతర వాగ్ధానాలు ఏమీ అమలు కాలేదని, వాటిని అమలు చేయాలని కోరారు. ఇసుక ధరల వల్ల ముఖ్యంగా భవన నిర్మాణ కార్మికులు తీవ్రంగా అవస్థపడుతున్నారు. వారి ఉపాధి దెబ్బతింటోందని చెప్పారు. గతంలోలాగా కంపెనీ ఆధిపత్యం లేకుండా ఉచిత ఇసుక అందించాలని కోరుతూ అక్టోబరు 4న సిపిఎం ఆధ్వర్యాన రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ ఆందోళనలను జయప్రదం చేయాలని ప్రజలను కోరారు.

**వరద సాయం సరిపడినంతగా లేదు**

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వరద సహాయం సరిపడినంతగా లేదని, ప్రకటించిన సహాయం కూడా సక్రమంగా అందడం లేదని శ్రీనివాసరావు పేర్కొన్నారు. కౌలు రైతులకు కూడా పరిహారం ఇస్తామని ప్రకటించి, కాని జీవో ఇవ్వలేదని తెలిపారు. దీంతో అధికారులు జిఓ ఉంటేనే అమలు చేస్తామని కౌలు రైతులను నమోదు చేయడం లేదని పేర్కొన్నారు. యజమానులకే ఇస్తున్నారని అన్నారు. కౌలు రైతులు అసంతృప్తితో ఆందోళన చేస్తే దానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. కౌలు రైతులకు వరద సహాయం అందేలా స్పష్టమైన మార్గదర్శకాలిచ్చి అమలు చేయాలని కోరారు.

**సేవలందించిన సిపిఎం, ప్రజా సంఘాల కార్యకర్తలు**

వరద సహాయక చర్యల్లో ప్రభుత్వం పడవలు ఇవ్వకపోయినా నీళ్లలో చివరి మూలలకు కూడా వెళ్లి పార్టీ, వివిధ ప్రజా సంఘాలు, వాలంటీర్లు సహాయం అందించారని తెలిపారు. పార్టీ నిర్వహించిన భోజనశాలకు మంచి పేరు వచ్చిందని, అధికారులు సైతం వాటిల్లోనే భోజనాలు చేశారని పేర్కొన్నారు. వరద సహాయక చర్యల్లో పాల్గొన్న యువత, విద్యార్థులు, పార్టీ కార్యకర్తలను అభినందించారు.

విజయవాడ వన్ టౌన్‌లో సహాయం నిష్పక్షపాతంగా అందించడం లేదని ప్రజలు నిరసన వ్యక్తం చేశారని, ప్రభుత్వం అటువంటివి జరగకుండా చూడాలని తెలిపారు. పేదవారికి అడ్రస్ మ్యాప్ ఉండదని, టెక్నాలజీపైనే పూర్తిగా ఆధారపడకుండా నేరుగా వరద ప్రాంతాలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి ఎక్కడెక్కడ పేదవారు ఉన్నారో వారికి వరద సాయం పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అంతే తప్ప టెక్నాలజీపైనే పూర్తిగా ఆధారపడతామనడం సమంజసం కాదని సూచించారు.

## తొలగించిన ఆశా వర్కర్‌ను విధుల్లోకి తీసుకోవాలి

- ఎపి ఆశా వర్కర్స్ యూనియన్

**ప్రజాశక్తి-అమరావతిబ్యూరో**

నెల్లూరు జిల్లాలో అక్రమంగా తొలగించిన కలిగిరి పిహెచ్‌సిలో పనిచేసే ఆశావర్కర్ పందిటి విజయలక్ష్మిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ధనలక్ష్మి, కార్యదర్శి కె లక్ష్మి, కోశాధికారి ఎ కమల.. వైద్యారోగ్యశాఖ కమిషనరు హరికిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. విజయలక్ష్మిని మూడు నెలలుగా వేధింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. గ్రామ సర్పంచ్ తీర్మానం పేరుతో తొలగించడం సరికాదని, తక్షణం ఆమెను విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

**ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006**

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ editorprajasakthi@gmail.comకు** పంపవచ్చు.

## తిరుమల ప్రతిష్టను దెబ్బతీసిన చంద్రబాబు

- వైసిపి

**ప్రజాశక్తి-అమరావతిబ్యూరో**

ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయలేక ప్రజలను పక్కదారి పట్టించేలా సిఎం చంద్రబాబు ఏకంగా తిరుమల ప్రతిష్టను దెబ్బతీసేలా చేస్తున్నారని మాజీ మంత్రులు పేర్ని నాని, కొడాలి నాని, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ఆరోపించారు.

తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం వారు మీడియాతో మాట్లాడారు. రాజకీయాల కోసం చంద్రబాబు దైవాన్ని కూడా వదల్లేదన్నారు. తిరుమలలో నెయ్యిని వెనక్కి పంపామని టిటిడి ఇఒ శ్యామలరావు చెబుతుంటే చంద్రబాబు, నారా లోకేష్, పవన్‌కల్యాణ్ మాత్రం అబద్ధాలతో అడ్డమైన ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. శనివారం రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి శ్రేణులు ప్రత్యేక పూజలు చేస్తారన్నారు. బాప్టిజం తీసుకున్నట్టు గతంలో పవన్‌కల్యాణ్ చెప్పారని, ఇప్పుడేమో రాజకీయాల కోసం వేశాలు వేస్తున్నారని విమర్శించారు. నెయ్యి రేటు రూ.వెయ్యి అని చెబుతున్న చంద్రబాబు.. హెరిటేజ్‌లో ఆవు నెయ్యి రూ.400లకు ఎలా ఇస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు.

## మద్యం నిల్వలకు కొరత లేదు

- ఎక్సైజ్‌శాఖ కమిషనరు నిషాంత్ కుమార్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్రంలో భారతీయ తయారీ విదేశీ మద్యానికి ఎలాంటి కొరత లేదని అబ్కారీ శాఖ సంచాలకులు నిషాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వినియోగానికి అవసరమైన మేరకు నిల్వలు వున్నాయన్నారు. సాధారణంగా 90,000 కేసుల ఐఎంఎఫ్ఎల్, 23,000 కేసుల బీరు రాష్ట్రంలో రోజువారీ సగటు వినియోగంగా వుందని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 20 రోజులకు సరిపడా మద్యం నిల్వలు వున్నాయన్నారు. వరదల వల్ల విజయవాడ నగరంలోని కొన్ని అవుట్‌లెట్లతో మాత్రమే నిల్వలు తగ్గుముఖం పట్టాయని వివరించారు.

# విలక్షణ నేత... ఆర్ఎస్

- ఆయన స్ఫూర్తితో ఉద్యమాలు
- మతోన్మాద శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- రుద్రరాజు సంస్మరణ సభలో వి శ్రీనివాసరావు



ఆర్ఎస్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం తదితరులు

**ప్రజాశక్తి- భీమవరం**

రాజకీయాల్లో డబ్బు, పదవులు రాజ్యమేలుతున్నా, అవేమీ మాకొద్దని విలక్షణమైన రాజకీయ నేతగా రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్) ముందుకు సాగారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. సిపిఎం సీనియర్ నేత, మాజీ ఎంఎల్ఎ ఆర్ఎస్ సంస్మరణ సభ ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం అధ్యక్షతన భీమవరంలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో బుధవారం జరిగింది. తొలుత ఆర్ఎస్ చిత్రపటానికి ఆచంట ఎంఎల్ఎ, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు పితాని సత్యనారాయణ, వి.శ్రీనివాసరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యవక్త శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్ఎస్ అంటే కార్మికులకు, ప్రజలకు ఒక ధైర్యమని అన్నారు. ఏదైనా సమస్యను పట్టుకుంటే సాధించే వరకూ ఉక్కు సంకల్పంతో పోరాడేవారని తెలిపారు. పదిహేడేళ్ల వయస్సులోనే ఎర్రజెండా పట్టుకుని కమ్యూనిస్టు ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లారన్నారు. అసెంబ్లీలో పోరాడే నేతగా ప్రజల పక్షాన నిలిచారన్నారు. విశాఖ ఉక్కు పోరాటంలో ఆర్ఎస్ పాత్ర ఎనలేనిదని తెలిపారు. జిల్లా సిపిఎం ఉద్యమ నిర్మాణంలో ఉద్దంరాజు రామం, అల్లూరిలతోపాటు ఆర్ఎస్ ఎంతో కృషి చేశారన్నారు. కేడర్ పట్ల అపారమైన అభిమానం ఆర్ఎస్ చూపించేవారని గుర్తు చేశారు. ఆర్ఎస్ మృతి చెందిన కొద్ది రోజుల్లోనే సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి కన్నుమూశారని, అంతా కమ్యూనిస్టులు పని అయిపోయిందని చెప్పుకునే తరుణంలో ఆకలి కేకలు వేసిన శ్రీలంకలో కమ్యూనిస్టు జెండా ఎగిరిందని అన్నారు. తిరుమల లడ్డూకు రాజకీయ రంగు పులిమి మతవిద్వేషాలు రెచ్చగొట్టాలని చూడడం దారుణమన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి టిటిడిలో అవినీతి, అక్రమాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. తమిళనాడు, కర్ణాటక, ఢిల్లీకి చెందిన వారంతా టిటిడిలో సభ్యులుగా ఉండాలని ఉవ్విళ్లూరడం వెనుక ఆంతర్యం అదేనని తెలిపారు. ప్రజల సొమ్ము, దేవుని సొమ్ము దోచుకుంటున్న వారు ఎవరో అందరికీ తెలుసన్నారు. తిరుపతి లడ్డూ వివాదంపై ప్రభుత్వం సిట్ వేసిందని, విచారణ జరిగేంత వరకూ ఆగకుండా ప్రాయశ్చిత దీక్ష అంటూ, సనాతన ధర్మపరిరక్షణ అంటూ మత విద్వేషాలు రెచ్చగొట్టాలని చూడడం దారుణమన్నారు. క్రైస్తవులకు, ముస్లింలకు వ్యతిరేకంగా మాట్లాడడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. మతవిద్వేషాలు, ఉద్రిక్తతలు రెచ్చగొట్టేందుకు రాజకీయ శక్తులు తెగబడుతున్నాయనే విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. ప్రాంతీయ పార్టీ టిడిపి మతం రంగు పులుముకుందని విమర్శించారు. రాష్ట్రంలో మత ఉద్రిక్తతలు రెచ్చగొడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. మతోన్మాద శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. మత సామరస్యం కోసం ఆర్ఎస్ జీవితాన్ని ధారపోశారన్నారు. సమసమాజ స్థాపన కోసం, ప్రజాసామ్యాన్ని కాపాడేందుకు చివరి వరకూ పోరాడారని తెలిపారు. స్వాతంత్ర్య పోరాటంలో మాదిరిగా నేటి పోరాటాల్లో యువత భాగస్వామ్యం కావాలని, అదే ఆర్ఎస్‌కు నిజమైన నివాళని అన్నారు. ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ మాట్లాడుతూ తాను ఏ పార్టీలో ఉన్నా కమ్యూనిస్టు పార్టీ అభిమానినని, ఆర్ఎస్ జీవన ప్రస్థానం ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. తన కుటుంబంతో ఆర్ఎస్‌కు ఎనలేని అనుబంధం ఉందని తెలిపారు. బలం, పోరాటం, స్ఫూర్తి కమ్యూనిస్టుల వద్ద ఉంటుందన్నారు. టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, ఎంసిపిఐ (యు) రాష్ట్ర కార్యదర్శి కాటం నాగభూషణం, ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి లంకా కృష్ణమూర్తి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త శ్రీనివాస్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షులు ఎన్‌విఎన్ గుప్తా, ప్రముఖ రచయిత కుమార్ తదితరులు మాట్లాడారు. తొలుత ఆర్ఎస్ జీవన ప్రస్థానంపై ప్రజాశక్తి ప్రచురించిన ప్రత్యేక సంచికను వి.శ్రీనివాసరావు, పితాని సత్యనారాయణ ఆవిష్కరించారు. అనంతరం బుధవారం రాత్రి ఆర్ఎస్ స్వగ్రామం యలమంచిలి మండలం చించినాడలో సిపిఎం మండల కార్యదర్శి కె.బాలరాజు అధ్యక్షతన జరిగిన సభలో వి.శ్రీనివాసరావు, మంతెన సీతారాం, సిపిఎం సీనియర్ నేత కేతా సూర్యారావు, ఆర్ఎస్ కుటుంబ సభ్యులు ప్రసంగించారు.

## మంచి ప్రభుత్వం ఎలా అవుతుంది?

- బాబు జవాబు చెప్పాలి
- వైఎస్ షర్మిల

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

సూపర్‌సిక్స్ అమలు చేయని ప్రభుత్వాన్ని మంచి ప్రభుత్వం అనాలా లేక ముంచే ప్రభుత్వం అనాలా అని వైసిపి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రశ్నించారు. విజయవాడ అలంకార్ సెంటర్ దర్నా చౌక్‌లో బుధవారం థాలి బజావ్ పేరుతో పళ్ళాలను గరిటలతో కొడుతూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ ఏడాదికి రూ.4లక్షల ఉద్యోగాలు అన్న మాట ఈ 100 రోజులు ప్రణాళికలో ఉద్యోగాల కల్పన మీద మీ ప్లాన్స్ ఏమిటని ఆమె ప్రశించారు? గత ప్రభుత్వం ప్రజలను మంచింది కాబట్టే, ప్రజలు మంచి చేస్తారని మిమ్మల్ని నమ్మారని, అయితే మీరు కూడా విశ్వసనీయత కోల్పోతున్నారని ఆమె టిడిపి కూటమి ప్రభుత్వాన్ని ఉద్దేశించి అన్నారు.

ఇటీవల కురిసిన వర్షాలకు రాష్ట్రంలో 7లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగితే చంద్రబాబు ప్రభుత్వం 2లక్షల ఎకరాలకు పరిహారం ఇస్తామంటున్నారన్నారు. పరిహారం మీద కోత పెట్టిన ప్రభుత్వాన్ని ముంచే ప్రభుత్వం అనరా? అని షర్మిల పేర్కొన్నారు. మోడీకి రాష్ట్రం మీద చిన్న చూపు ఉందని, అందుకే ఇక్కడ వరదల్లో సర్వం కోల్పోతే రైల్ నీర్ కూడా ఇవ్వలేదన్నారు.. రాష్ట్రానికి మోసం చేసిన మోడీతో చంద్రబాబు ఎందుకు జత కట్టారో ప్రజలకు సమాధానంచెప్పాలని షర్మిల డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అవుకు రిజర్వాయర్ రివిట్‌కు రంధ్రం

**మరమ్మతులు చేసిన ఎస్ఆర్‌బిసి అధికారులు**



అవుకు రిజర్వాయర్ కట్టపై ఏర్పడిన రంధ్రం

**ప్రజాశక్తి - అవుకు (నంద్యాల)**

నంద్యాల జిల్లా అవుకు తిమ్మరాజు రిజర్వాయర్ రివిట్‌కు రంధ్రం ఏర్పడింది. దీంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. సామర్థ్యానికి మించి నీటిని నిల్వ చేయడంతో ఈ పరిస్థితి తలెత్తిందని కొందరు స్థానికులు పేర్కొంటున్నారు. రిజర్వాయర్ 4.15 టిఎంసిల కెపాసిటీ ఉండగా ప్రస్తుతం 4.15 టిఎంసిల నిల్వ ఉందని అధికారులు తెలిపారు. రిజర్వాయర్ నుంచి గాలేరు-నగరి సుజల ప్రవంతి (జిఎన్ఎస్ఎస్) కాలువకు పదివేల క్యూసెక్కులు, ఎస్ఆర్‌బిసి కాలువకు 270 క్యూసెక్కుల నీటిని వదులుతున్నామని శ్రీశైలం రైట్ బ్యాంకు కెనాల్ (ఎస్ఆర్‌బిసి) డిఇ కొండన్న తెలిపారు. మంత్రి బిసి జనార్ధన్ ఆదేశాల మేరకు అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని రంధ్రంపడిన ప్రాంతాన్ని పూడ్చారు.

మట్టితో పూడ్చడం వలన రిజర్వాయర్ కట్ట పటిష్టంగా ఉంటుందా? లేదా? అన్న సందేహం రిజర్వాయర్ దిగువ ప్రాంతాలైన చెన్నంపల్లి, ఓబులాపురం, శివవరం, చిన్న కొట్టాల, అవుకు, అన్నవరం ప్రజల్లో వ్యక్తం అవుతుంది.

**ఎటువంటి ప్రమాదమూ లేదు : డిఇ కొండన్న**

రివిట్‌మెంట్‌పై ఉన్న రాళ్లు కొంతమేర కదిలాయని, వాటి వలన ఎటువంటి ప్రమాదమూ ఉండదని ఎస్ఆర్‌బిసి డిఇ కొండన్న తెలిపారు. ఈ విషయంపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రంధ్రం పడిన ప్రాంతాన్ని వెంటనే మట్టితో కప్పివేశామన్నారు. రిజర్వాయర్‌లో ఉన్న నీటి నిల్వ సామర్థ్యాన్ని కొంతమేర తగ్గిస్తున్నామని తెలిపారు.

# వినియోగదారులపై భారం వేయడం తగదు

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు
- జెన్‌కో కొత్తప్లాంట్ల టారీఫ్‌పై ఎపిఈఆర్‌సి విచారణ

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

జెన్‌కో నూతన ప్లాంట్ల నిర్మాణ జాప్యం వల్ల పెరిగిన అదనపు క్యాపిటల్ వ్యయ భారం వినియోగదారులపై వేయడం తగదని సిపిఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు కోరారు. శ్రీదామోదరం సంజీవయ్య, నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్లలో నూతనంగా నిర్మించిన 800 మెగావాట్ల ప్లాంట్ల అదనపు కాపిటల్ వ్యయం, టారీఫ్‌ల అనుమతులపై ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఎపిఈఆర్‌సి) బుధవారం విచారణ నిర్వహించింది. ఎపిఇఆర్‌సి ఛైర్మన్ నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ విచారణలో బాబూరావు ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు. నూతన ప్లాంట్ల నిర్మాణం వల్ల క్యాపిటల్ వ్యయం దాదాపు రెట్టింపు అయ్యిందని తెలిపారు. ఒక మెగావాట్ విద్యుత్‌కు వ్యయం రూ.5 నుంచి 11 కోట్లకు పెరిగిందని వివరించారు. ఉద్దేశపూర్వకంగా పాలకులు అవలంభించిన విధానాలే దీనికి కారణమని విమర్శించారు. ప్రభుత్వ విద్యుత్ ఉత్పత్తి సంస్థలను దెబ్బతీసి ప్రైవేటీకరణ విధానాలను కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు పెంచి పోషిస్తున్నాయని పేర్కొన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విద్యుత్ రంగం మొత్తాన్ని ప్రైవేట్ కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తోందని అన్నారు. క్యాపిటల్ ఖర్చులు పెంచి ఫిక్స్‌డ్ ఛార్జీలు రూపంలో విద్యుత్ ఛార్జీల భారాన్ని ప్రజలపై రానున్న 25 ఏళ్లపాటు మోపుతున్నారని అన్నారు. నిర్మాణ జాప్యం చేసిన కాంట్రాక్టర్ల నుంచి నష్టాన్ని రాబట్టకుండా ప్రజలపై భారం వేయడం సరికాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. థర్మల్ ప్లాంట్లలో పెద్దఎత్తున అవినీతి సాగుతోందని విమర్శించారు. బడా కంపెనీలకు రాయితీలు ఇస్తూ ప్లాంట్ల నిర్మాణంలో మృతిచెందిన కార్మికులకు మాత్రం నష్టపరిహారం చెల్లించటంలో బేరసారాలు ఆడటం దుర్మార్గమన్నారు. ప్లాంట్ వల్ల వచ్చే కాలుష్యం వల్ల ఆ ప్రాంత ప్రజల ఆరోగ్యం దెబ్బతింటున్నదని, వ్యవసాయంపై ప్రభావం పడుతుందని చెప్పారు. కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలపై భారాలు పడకుండా ఉద్యోగులు, కార్మికుల ప్రయోజనాలను కాపాడాలని చెప్పారు. కాంట్రాక్టర్ల మేలు కోసం ప్రజలపై భారాలు మోపుతూ అధికారులు చేసిన ప్రతిపాదనలను వెనక్కి తీసుకోవాలని కమిషన్‌ను కోరారు. బుడమేరు వరదల్లో సర్వస్వం కోల్పోయిన వినియోగదారుల నుంచి విద్యుత్ ఛార్జీలు వసూలు రద్దు చేయాలని కోరారు. గత ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపే విధంగా అదానీ కంపెనీతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గ్రీన్ పవర్‌పేరుతో కొత్త ప్రభుత్వం చేస్తున్న ప్రతిపాదనలపై చర్చ జరపకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం తగదన్నారు.

## 'ఉక్కు'పై కేంద్రం కుట్రలు తిప్పికొట్టాలి




**ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)**

స్టీల్‌ప్లాంట్ నిర్వీర్యానికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ఐక్య పోరాటాలతో తిప్పికొట్టాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్లు డి ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 1322వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఐఎన్‌టియుసి కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ అన్ని వైపుల నుంచి ఉక్కు ప్రయివేటీకరణకు కుట్రలు జరుగుతున్నా సుదీర్ఘ పోరాటంతో కార్మికులు అడ్డుకుంటున్నారని, ఇది చారిత్రాత్మకమని తెలిపారు. ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని కేంద్రానికి లేఖలు రాసినా, నిరసనలు, ఆందోళనలు చేపట్టినా పట్టకపోవడం దారుణమన్నారు. ముున్ముందు ఉక్కు పరిరక్షణ పోరాటం మరింత ఉధృతం కానుందని తెలిపారు.

## వరద సాయంలో అప్పే ఎక్కువ

- ఆర్థిక ప్యాకేజి సిద్ధంచేసిన అధికారులు

**ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి**

వరదలకు నష్టపోయిన వారికి పెద్ద ఎత్తున రుణాలు ఇప్పించడం ద్వారా ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. నేరుగా సాయం చేస్తే ఖజానాపై పడే ఆర్థిక భారాన్ని తట్టుకునే పరిస్థితి లేకపోవడంతో ఎక్కువ భాగాన్ని రుణం రూపేనా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో రంగానికి ఇచ్చే సాయంలో సుమారు 20 శాతం వరకు ప్రభుత్వం ఇచ్చేలా, మిగిలిన సాయాన్ని బ్యాంకులు, ఫర్నిచర్ సంస్థల నుంచి ఇప్పించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ఆగస్టు చివరిలో, సెప్టెంబర్ తొలి రోజుల్లో కురిసిన భారీ వర్షాలు, సంభవించిన వరదల కారణంగా ఎక్కువగా ఎన్టీఆర్, గుంటూరు, ఏలూరు, కాకినాడ వంటి జిల్లాల్లో తీవ్ర నష్టం వాటిల్లిన సంగతి తెలిసిందే. లక్షలాది మంది నిరాశ్రయులుకాగా, వేల కోట్ల నష్టం సంభవించింది. ఈ నేపథ్యంలోనే బాధితులను ఆర్థికంగా ఆదుకోవాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వంపై పడింది. అయితే, రోడ్లు,నీటిపారుదల, ఇతర ప్రభుత్వ రంగ ఆస్తులకు కూడా నిధులను సమకూర్చాల్సి రావడంతో సాధారణ ప్రజలకు ఎక్కువ నిధులను వెచ్చించడం కష్టం మారినట్లు అధికారులు చెబుతున్నారు. అందుకే బ్యాంకులతో కూడా చర్చించి రుణాలను అందించాలని నిర్ణయించారు.

ముంపునకు గురైన ప్రాంతాల్లో గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉంటున్న వారికి ప్రభుత్వం తరపున 25 వేల రూపాయలు ఇవ్వనుండగా, బ్యాంకుల ద్వారా 50 వేలు, ఇంటిలోని చెడిపోయిన వస్తువుల కొనుగోలుకు హోమ్ అప్లయెన్సెస్ దుకాణాల నుంచి 50 వేలు రుణాలుగా ఇప్పించాలని నిర్ణయించారు. అంటే ఒక్కో ఇంటికి 1.25 లక్షలు సమకూరనుంది. అలాగే తొలి అంతస్తు, ఆపై అంతస్తుల్లో ఉంటున్న వారికి. చెడిపోయిన వాహనాలు, తోపుడు బండ్లు, చిన్న పరిశ్రమలు, జిఎస్‌టి చెల్లించే వ్యాపారస్తులు, ఇతర చేతి వృత్తుల్లో ఉండేవారు, వ్యవసాయం, ఉద్యానవన పంటలు నష్టపోయిన వారికి కూడా ఇదే తరహాలో సాయం, రుణాలు అందించాలని నిర్ణయించారు. ఈ మేరకు బ్యాంకులకు కూడా లక్ష్యాలు నిర్దేశించడం గమనార్హం.

**రంగాల వారీగా అందించే సాయం వివరాలు (రూపాయల్లో)**

| విభాగం | ప్రభుత్వం | బ్యాంకు | అప్లయెన్సెస్ |
|---|---|---|---|
| గ్రౌండ్ ఫ్లోర్ | 25,000 | 50,000 | 50,000 |
| ఇతర ఫ్లోర్లలో | 10,000 | 25,000 | 25,000 |
| ద్విచక్ర వాహనాలకు | 3,000 | 50,000 | --- |
| ఆటో రిక్షాలకు | 10,000 | 1,00,000 | --- |
| తోపుడు బండ్లకు | 5,000 | --- | --- |
| జిఎస్‌టి వ్యాపారులకు | 25,000 | 5,00,000 | --- |
| నాన్ జిఎస్‌టి వారికి | 25,000 | 20,00,000 | --- |
| నేత, వృత్తి కళాకారులు | 15,000 | --- | --- |
| మత్స్యకారులకు | 9,000 | --- | --- |
| ముద్ర ద్వారా | --- | 10,00,000 | --- |
| స్వానిధి | --- | 80,000 | --- |
| లక్‌పతి దీదీ | --- | 1,50,000 | --- |

## న్యాయం చేయండి

- విఐటి వద్ద ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని తల్లిదండ్రుల ఆందోళన

**ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)**

తమకు న్యాయం చేయాలంటూ ఈ నెల 17న అమరావతి విఐటిలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని సాయిశ్రీయ తల్లిదండ్రులు కళాశాల ఎదుట ఆందోళనకు దిగారు. బాధితుల వివరాల మేరకు.. తమ కూమార్తె ఆత్మహత్య చేసుకుందని సమాచారం ఇచ్చి తాము వచ్చే వరకు ఆగకుండా పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని గుంటూరు జిజిహెచ్‌కు తరలించారన్నారు. తమ కుమార్తె మృతిపై అనుమానాలున్నాయని, విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై తుళ్లూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. విద్యార్థిని సాయిశ్రీయ హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో రాఘవేంద్ర కాలనీకి చెందిన మంజుల, చంద్రశేఖర్ దంపతుల పెద్ద కుమార్తె. ఆమె విఐటిలో ఇంజనీరింగ్ రెండవ సంవత్సరం చదువుతున్నారు. ఈ నెల 17న కళాశాల హాస్టల్ గదిలో ఉరి వేసుకుని చనిపోయారు.



చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

## మరో పది మంది విద్యార్థినులకు అస్వస్థత

**ప్రజాశక్తి - శృంగవరపుకోట**

విజయనగరం జిల్లా ఎస్.కోట ఎస్‌సి కళాశాల బాలికల వసతి గృహంలో మరో పది మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. మంగళవారం మధ్యాహ్నం భోజనం తిన్న విద్యార్థుల్లో అరుగురు అస్వస్థతకు గురి కావడంతో వారిని స్థానిక సిహెచ్‌సికి తరలించారు. బుధవారం మరో పదిమంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. వీరిని కూడా సిహెచ్‌సికి తరలించారు. మొత్తం 16 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. దీంతో వసతి గృహంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. చికిత్స పొందుతున్న విద్యార్థినులను ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. అనంతరం వసతి గృహంలో ఆహారం తయారీని పరిశీలించారు. నాణ్యతలో రాజీ పడొద్దని.. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. వసతి గృహంలో మొత్తం 180 మంది విద్యార్థినులు ఉన్నారు. కలుషిత ఆహారం తినడం వల్లే విద్యార్థినులు అస్వస్థతకు గురైనట్లు సమాచారం.

## సత్యవేడు ఎమ్మెల్యేపై కేసు కొట్టివేత

**ప్రజాశక్తి - తిరుపతి సిటి**

తిరుపతి జిల్లా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై నమోదైన లైంగిక ఆరోపణల కేసును హైకోర్టు కొట్టివేస్తూ బుధవారం తీర్పు వెలువరించింది. ఎమ్మెల్యేపై ఈ నెల 5న తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో అత్యాచార కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో తనపై నిరాధార ఆరోపణలతో కేసు నమోదు చేశారని, కేసును కొట్టివేయాలని హైకోర్టును ఎమ్మెల్యే ఆశ్రయించారు. ఈ క్రమంలోనే కేసు పెట్టిన మహిళ సైతం ఈ కేసులో నిజంలేదని, తాను పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు అవాస్తవమని కోర్టులో లాయర్ ద్వారా అఫిడవిట్ దాఖలు చేశారు. ఈ కేసుకు సంబంధించి హైకోర్టు బుధవారం తీర్పును వెలువరిస్తూ ఎమ్మెల్యే ఆదిమూలంపై నమోదైన కేసును కొట్టివేస్తున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో సత్యవేడు నియోజకవర్గంలోని టిడిపి కూటమి పార్టీల శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. ఎమ్మెల్యే పై విధించిన సస్పెన్షన్ను వెంటనే ఎత్తివేయాలని, ఎమ్మెల్యే మళ్లీ ప్రజల్లోకి యథావిధిగా రావాలని కార్యకర్తలు కోరారు.

## రథం కేసులో ఒకరు అరెస్టు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

అనంతపురం జిల్లా కనేకల్లు మండలం హనకనహాళ్‌లో సోమవారం రాత్రి రామాంజనేయస్వామి రథానికి నిప్పంటించిన ఘటనను పోలీసులు ఛేదించారు. ఘటనకు సంబంధించి ఓ వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతపురం పోలీసు కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్‌పి పి.జగదీష్ ఇందుకు సంబంధించి వివరాలను వెల్లడించారు. హనకనహాళ్ గ్రామానికి చెందిన వైసిపి మద్దతుదారుడు బోడిమల్ల ఈశ్వరరెడ్డి... పెట్రోల్ పోసి రథానికి నిప్పు అంటించినట్లు విచారణలో తేలింది. నిందితుడిని బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. గ్రామంలో వ్యక్తిగత కక్షల నేపథ్యంలో రథానికి నిప్పుపెట్టినట్లు విచారణలో తేలిందని ఎస్‌పి చెప్పారు.

## సత్వరమే కానిస్టేబుల్ పోస్టుల భర్తీ

- డివైఎఫ్‌ఐ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్ ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని డివైఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వై రాము, జి రామన్న బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రెండేళ్ల క్రితం విడుదల చేసిన 6,100 కానిస్టేబుల్ నోటిఫికేషన్ ప్రక్రియను ఇప్పటి వరకు పూర్తిచేయకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. 95,208 మంది అభ్యర్థులు ప్రాథమిక రాత పరీక్ష రాసి అర్హత సాధించారని, వీరికి దేహదారుఢ్య పరీక్షలు, మెయిన్స్ రాత పరీక్షలు ఇప్పటి వరకు నిర్వహించలేదని తెలిపారు. గత ప్రభుత్వం హోంగార్డులకు రిజర్వేషన్లు పెంచడం వల్ల నిరుద్యోగులకు తీవ్ర నష్టం ఏర్పడుతుందన్నారు. పాత పద్ధతిలోనే నియామకం చేయాలని డిమాండ్ చేశారు. హోంగార్డుల పేరుతో ఉన్న ఉద్యోగాలను నిరుద్యోగులకు కాకుండా చేసే కోర్టు తీర్పుపై ప్రభుత్వం స్పందించాలని కోరారు.

## 'కొనకళ్ల'కు అభినందనలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఎస్‌ఆర్‌టిసి ఛైర్మన్, మచిలీపట్నం మాజీ ఎంపి కొనకళ్ల నారాయణను ఎపి పిటిడి కార్మిక పరిషత్తు అభినందించింది. ఈ మేరకు బుధవారం సచివాలయంలో కొనకళ్ల నారాయణను కలిసిన వారిలో రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌వి శేషగిరి, ప్రధాన కార్యదర్శి వై శ్రీనివాసరావు, కోశాధికారి కె సురేంద్ర, ప్రచార కార్యదర్శి వై రమేష్ ఉన్నారు.

**జగన్‌కు బాధ్యత లేదా**

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ హయాంలో టిటిడిలో జరిగిన అపచారాలను ఆ సమయంలో నియంత్రించే బాధ్యత ఆయనకు లేదా? అని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రశ్నించారు. విజయవాడలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు.

## లడ్డూ వ్యవహారంపై పిల్

ప్రజాశక్తి-అమరావతి

తిరుమల లడ్డూ నెయ్యి కల్తీ విషయంలో రాజకీయ నాయకులు ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య సృష్టిస్తున్నారంటూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కెఎ పాల్ అత్యవసర లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. సిబిఐ దర్యాప్తునకు ఆదేశించాలనే పిల్‌పై విచారణ చేపట్టాలని ఆయన చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన డివిజన్ బెంచ్‌ను బుధవారం కోరారు.

**హైకోర్టు ఆక్షేపణ**

ఒక అపార్ట్‌మెంటు విషయంలో పిల్ దాఖలు చేసిన ఎపి యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్‌టిఐ క్యాంపెయిన్ అధ్యక్షులు ఎన్ సత్యనారాయణ తీరును హైకోర్టు ఆక్షేపించింది. రూ.లక్ష రిజిస్ట్రార్ వద్ద డిపాజిట్ చేశాకే పిల్‌పై విచారణ చేస్తామని ప్రకటించింది.

**రిమాండ్‌ను సవాల్ చేసిన విద్యాసాగర్**

సినీనటి జత్వానీ కేసులో విజయవాడ కోర్టు విధించిన రిమాండ్‌ను వ్యాపారవేత్త కె విద్యాసాగర్ హైకోర్టులో సవాల్ చేశారు. రిమాండ్ ఉత్తర్వులను కొట్టేయాలన్న లంచ్‌మోషన్ పిటిషన్ తరపున సీనియర్ న్యాయవాది టి నిరంజన్‌రెడ్డి వాదించారు. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేస్తూ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప ఉత్తర్వులు జారీ చేశారు.

# అడ్డగోలు పెట్రో దోపిడి..!

- 70 డాలర్లకు తగ్గిన ముడి చమురు
- ప్రజలపై రూ.2 లక్షల కోట్ల భారం




**న్యూఢిల్లీ :** అంతర్జాతీయ ముడి చమురు ధరల్లో భారీ తగ్గుదల చోటు చేసుకుంటున్నప్పటికీ.. భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు మాత్రం గరిష్టంలోనే ఉన్నాయి. ప్రపంచ మార్కెట్‌లో ఈ ఏడాది ఏప్రిల్‌లో బ్యారెల్ ముడి చమురు ధర 92 డాలర్లుగా ఉండగా.. తాజాగా 70 డాలర్ల దిగువకు పడిపోయింది. సెప్టెంబర్ 9న ఏకంగా 69 డాలర్లుగా పలికింది. ఆరు నెలల్లో దాదాపుగా 20 శాతం ధరలు దిగివచ్చాయి. 2021 డిసెంబర్ నాటి కనిష్ట స్థాయిలో చమురు ధరలు పలుకుతున్నాయి. అయినప్పటికీ బిజెపి ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను హెచ్చు స్థాయిలోనే కొనసాగిస్తూ.. ప్రజల ఆదాయాలను సొమ్ము చేసుకుంటుంది. ముడి చమురుపై కేవలం 10 డాలర్ల తగ్గితే ఏడాదికి రూ.1.08 లక్షల కోట్లు ఆదా అవుతోంది. ఇటీవల దాదాపు 20 డాలర్లు పైగా తగ్గడంతో మోడీ సర్కార్ ఖజానాకు ఏడాదికి రూ.2 లక్షల కోట్లు పైనే సమకూరనుంది. అంటే ఆ మొత్తాన్ని ప్రజలపై అదనంగా భారం మోపినట్లు అవుతుంది.

పెట్రోల్, డీజిల్ ధరలపై దేశ వ్యాప్తంగా ప్రజల్లో తీవ్ర నిరసన వ్యక్తం అవుతోన్న నేపథ్యంలో ఇటీవలి సార్వత్రిక ఎన్నికలకు రెండేళ్ల ముందు నుంచే ధరలను సవరించడం ఆపేసింది. పెంచిన ధరలను కొనసాగిస్తోంది. చివరి సారిగా 2022 ఏప్రిల్‌లో లీటర్ పెట్రోల్, డీజిల్ మీద నామమాత్రంగా రూ.2 ధర తగ్గించింది. ప్రస్తుతం అనేక రాష్ట్రాల్లో లీటర్ పెట్రోల్ ధర రూ.100పైనా, డీజిల్ ధర రూ.90పైనే పలుకుతోంది. గ్లోబల్ మార్కెట్లో ముడి చమురు ధర నిలకడగా కొనసాగితే దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గే అవకాశం ఉందని ఇటీవల కేంద్ర చమురుశాఖ కార్యదర్శి పంకజ్ జైన్ అన్నారు. కానీ చమురు ధరలు దిగివచ్చినప్పటికీ కేంద్రం ఇప్పటికీ హెచ్చు ధరలను కొనసాగిస్తుంది. భారత్ తన చమురు అవసరాల్లో 88 శాతం దిగుమతులపైనే ఆధారపడుతోంది. ప్రపంచంలోని అతిపెద్ద ఇంధన వినియోగదారుల్లో భారత్ ఒకటిగా ఉంది. రష్యా ముడి చమురు ఇప్పటికీ తక్కువ ధరే లభిస్తుందని కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పురి గత వారం స్వయంగా ప్రకటించారు. దాంతో రష్యన్ కంపెనీల నుంచి మరింత చమురును కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 2022లో ఉక్రెయిన్-రష్యా మధ్య నెలకొన్న భౌగోళిక అనిశ్చితుల వల్ల యూరప్ దేశాలు రష్యా చమురు దిగుమతిపై ఆంక్షలు విధించాయి. దాంతో రష్యా చమురు ధరలు భారీగా తగ్గించడంతో పాటు రూపాయిల్లోనూ వాణిజ్యం చేసుకునేందుకు ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. ఇది భారత్‌కు చాలా కలిసివచ్చింది. ఉక్రెయిన్‌తో యుద్ధానికి ముందు భారత్ ముడి చమురు దిగుమతిలో రష్యా వాటా 1 శాతం కంటే తక్కువ ఉండేది. క్రమంగా అది పెరుగుతూ దాదాపు 40 శాతం వాటాకు చేరింది. పైగా రష్యా నుంచి చౌకగా చమురును దిగుమతి చేసుకుంటుంది. అయినప్పటికీ ఆ ప్రతిఫలాలను ప్రజలకు అందించక పోగా ఎక్సైజ్ టాక్స్‌ను పెంచే యోచనలో ఉందని సంకేతాలు వస్తున్నాయి. దేశంలో అధిక చమురు ధరలు ప్రజల ఆదాయాలను గండి కొడుతున్నాయి. మరోవైపు హెచ్చు ఇంధన ధరలు ద్రవ్యోల్బణానికి ఆజ్యం పోస్తున్నాయి. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ టాక్స్‌ను మరింత పెంచి తన ఖజానాను భారీగా పెంచుకునే పనిలో పడటం గమనార్హం.

## పిపిల పోస్టులను ఎప్పుడు భర్తీ చేస్తారు?

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్రంలోని కింది కోర్టుల్లో ఉన్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ల (పిపి), అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల (ఎపిపి) పోస్టుల భర్తీకి తీసుకునే చర్యలను వివరించాలని రాష్ట్రాన్ని హైకోర్టు కోరింది. కేడర్ పిపిల నియామకానికి తీసుకుంటున్న చర్యలను తెలియజేయాలంది. వీలైనంత త్వరగా భర్తీకి చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. విచారణను 3 వారాలకు వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

**అన్యాయంగా తొలగించారు : వెంకటలక్ష్మి**

మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ పదవి నుంచి తనను అన్యాయంగా తొలగించారంటూ గజ్జల వెంకటలక్ష్మి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ జరగనుంది.



## వరద రాజకీయాలు మాని
# అంగన్‌వాడీలకు న్యాయం చేయాలి

- సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు అంగన్‌వాడీ సంఘాల డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సిఐటియు అనుబంధ అంగన్‌వాడీ సంఘంపై తెలుగునాడు అంగన్‌వాడీ యూనియన్ నాయకులు అబద్ధాలు, అవాస్తవాలతో ప్రకటన చేయడం దుర్మార్గపు చర్య అని, దీన్ని తాము ఐక్యంగా ఖండిస్తున్నామని సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు అనుబంధ అంగన్‌వాడీ యూనియన్ నాయకులు తెలిపారు. తెలుగునాడు అంగన్‌వాడీ సంఘం నాయకులు చేసిన తప్పుడు ప్రకటనలను ఖండిస్తూ ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి బేబీరాణి, కె సుబ్బరావమ్మ, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఎఐటియుసి) ప్రధాన కార్యదర్శి జె లలితమ్మ, ఎపి ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఐఎఫ్‌టియు) ప్రధాన కార్యదర్శి విఆర్ జ్యోతి ఉమ్మడిగా ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వరదలు రావడంతోపాటు, విజయవాడ బుడమేరు పొంగి ప్రజలు కట్టుబట్టలతో బయటకు వచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు వాటి అనుబంధ సంఘాల యూనియన్లు అనేక మంది కార్యకర్తలు నడుములోతు నీళ్లలో కూడా బాధితులకు అండగా నిలిచారని తెలిపారు. ప్రజలు, కార్మికులు కష్టాల్లో ఉన్నప్పుడు అంగన్‌వాడీ కార్యకర్తల వద్ద, దాతల సహకారంతో లక్షల రూపాయలు వసూలు చేసి వరద బాధితులకు సహాయంగా ఆహారం, మంచినీటి ప్యాకెట్లు, దుస్తులు, వస్తువులు, సరుకులు అనేక పంపిణీ చేసిన చరిత్ర ట్రేడ్ యూనియన్లదని తెలిపారు. సిఎం వరద సహాయ కార్యక్రమంలో దెబ్బతిన్న బాధితులకు సహాయం చేస్తున్నారని అభిప్రాయంతో సెప్టెంబర్ 12న సిఎంను స్వయంగా కలిసి ప్రతి అంగన్‌వాడీ సెంటర్ నుండి రూ.100 చొప్పున బాధితులకు సాయంగా వేతనాల నుండి తీసుకోవాలని మూడు సంఘాల తరపున వినతిపత్రం ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. అలాగే ఐసిడిఎస్ డైరెక్టర్‌కు విన్నవించామన్నారు. ఈ మొత్తం కనీసం రూ.50 లక్షల వరకూ వస్తుందని తెలిపారు. అయితే ఒక్కొక్కరితో ఒక్కో రీతిలో తెలుగునాడు యూనియన్ నాయకులు వసూళ్లు చేస్తున్నారని, ఆ బురద సిఐటియు మీద చల్లడానికి ప్రయత్నించారని, దీన్ని అంగన్‌వాడీలు సహించరని పేర్కొన్నారు. కార్మిక ఐక్యతకు భంగం కలిగించే ఇటువంటి తప్పుడు ఆరోపణలు, అబద్ధపు ప్రచారాలు మానుకోవాలని హెచ్చరించారు. అంగన్‌వాడీల్లో గందరగోళం సృష్టించి లాభం పొందాలనుకునే స్వార్థ బుద్ధిని వదులుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమ్మెకాలంలో ప్రభుత్వాలు ఇచ్చిన మామీ అమలు కోసం కృషి చేస్తే బాగుంటుందని సూచించారు.

# ప్రభుత్వానికి మంచి పేరు తేవాలి

- కార్పొరేషన్ చైర్మన్లతో ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బాగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. నూతనంగా ఎంపికైన పలు కార్పొరేషన్ చైర్మన్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును సచివాలయంలో బుధవారం కలిశారు. ట్రాక్ రికార్డుల ఆధారంగా చిన్న స్థాయి నేతలకు కూడా కార్పొరేషన్‌లలో అవకాశాలు ఇచ్చామని చంద్రబాబు అన్నారు. ప్రభుత్వంలో పదవి అనేది ఒక బాధ్యత అని, మనలో ఎక్కడా అహంకారం కనిపించకూడదని చెప్పారు. సింపుల్ గవర్నమెంట్, ఎఫెక్టివ్ గవర్నెన్స్ అని తాను, పవన్ కళ్యాణ్ చెప్పామని, అదే పాటించాలని చెప్పారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపిలతో కలిసి సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**టిడిపి గ్రీవెన్స్ జాబితా విడుదల**

టిడిపి కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించే నాయకుల జాబితా విడుదలైంది. అక్టోబర్ 10 వరకు అందుబాటులో ఉండే నాయకుల పేర్లను ఆ పార్టీ కార్యాలయం కార్యదర్శి పి అశోక్ బాబు బుధవారం విడుదల చేశారు. ఈ నెల 26న మంతెన రామరాజు, గన్ని వీరాంజనేయులు, 27న రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్‌రావు యాదవ్, మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, 28న పల్లా శ్రీనివాస్, మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి, 30న మంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్సీ బిటి నాయుడు, 3న మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, 4న పల్లా శ్రీనివాస్, మంత్రి గుమ్మడి సంధ్యారాణి, 5న పల్లా శ్రీనివాస్, మంత్రి పయ్యావుల కేశవ్, 7న మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి, పొలిట్ బ్యూరోసభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం, 8న మంత్రి పొంగూరు నారాయణ, పొలిట్ బ్యూరోసభ్యులు వర్ల రామయ్య, 9న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, మాజీమంత్రి పనబాక లక్ష్మీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

**ప్రజలే మంచి ప్రభుత్వం అంటున్నారు: అశోక్ బాబు**

ప్రజలే తమ ప్రభుత్వాన్ని మంచి ప్రభుత్వం అంటున్నారని ఎమ్మెల్సీ అశోక్ బాబు అన్నారు. టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ ప్రభుత్వం 100 రోజుల్లో సాధించిన ప్రగతిని నేతలు, అధికారులు ప్రజల్లోకి తీసుకెళ్తున్నారని చెప్పారు.

## అక్టోబరు తొలి వారంలో బీమా లోక్ అదాలత్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బుడమేరు వరదలతో విజయవాడలోని జలమయమైన కారణంగా దెబ్బతిన్న బీమా మోటారు వాహనాల బీమా క్లెయిమ్ సత్వర పరిష్కారానికి అక్టోబరు ఒకటి నుంచి 7 వరకు విజయవాడలో ఇన్సూరెన్స్ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నామని రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ మెంబరు సెక్రటరీ (డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి) ఎమ్ బబిత తెలిపారు. ఈ మేరకు బుధవారం సచివాలయం దగ్గర్లో నున్న రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో బీమా కంపెనీలు, ఆటో మొబైల్ బాడీ షాప్స్, ఆటో డ్రైవర్ల అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ప్యాట్రన్ ఇన్ చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, కార్యనిర్వాహక అధ్యక్షులు, న్యాయమూర్తి జస్టిస్ నరేందర్ ఆదేశాల మేరకు ఇన్సూరెన్స్ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు.



## సర్పంచ్ భార్య ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-తిరువూరు (ఎన్‌టిఆర్ జిల్లా)

ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు మండల చిట్టేల టిడిపి గ్రామ సర్పంచ్ తుమ్మపల్లి శ్రీనివాసరావు భార్య, కోకిలంపాడు విఆర్‌ఒ కవిత బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. దీనిపై సర్పంచ్ శ్రీనివాసరావు విలేకర్లతో మాట్లాడుతూ తనను తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తీవ్ర పదజాలంతో మంగళవారం దూషించడమే కాక బెదిరింపులకు పాల్పడ్డారని తెలిపారు. బుధవారం తాను పొలానికి వెళ్తుంటే 20 మంది రౌడీలతో ఎమ్మెల్యే కొలికపూడి తమ గ్రామానికి వచ్చి దాడి చేసేందుకు ప్రయత్నించగా తప్పించుకున్నానని చెప్పారు. ఈ పరిణామాల నేపథ్యంలో తన భార్య మనస్తాపానికి గురై నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయ్నానికి పాల్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను మెరుగైన చికిత్స కోసం విజయవాడ తీసుకెళ్లామని చెప్పారు.

## వైసిపికి మాజీ ఎమ్మెల్యే రెహమాన్ రాజీనామా



ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

వైసిపి క్రియాశీల సభ్యత్వానికి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవికి మాజీ ఎమ్మెల్యే, వుడా మాజీ చైర్మన్ డాక్టర్ ఎస్‌ఎ రెహమాన్ రాజీనామా చేశారు. విశాఖపట్నం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆ విషయాన్ని ఆయన వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముస్లిముల సంక్షేమానికి పెద్దపేట వేస్తానని చెప్పడంతో స్థానిక ముస్లిము నేతల కోరికతో తాను ఈ నిర్ణయం తీసుకున్నానని చెప్పారు. మైనారిటీ శాఖ మంత్రి ఫరూఖ్ వచ్చే నెలలో విశాఖపట్నం వస్తున్న నేపథ్యంలో ఆయనతో మాట్లాడతానని, ముఖ్యంగా స్థానిక ముస్లిము పెద్దల అభిప్రాయం తీసుకొని ఏ పార్టీలో చేరాలన్నదానిపై తుది నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం ముస్లిముల ప్రయోజనాలను ఏమాత్రమూ పరిరక్షించలేక పోయిందని, వక్ఫ్ ఆస్తుల రక్షణలో విఫలమైందని విమర్శించారు. ముస్లిముల సమస్యలను పలుసార్లు వైసిపి ముఖ్య నేతలకు నివేదించినప్పటికీ ఫలితం లేకపోయిందని చెప్పారు.

# పొదుపు సంఘాల రుణాలు రద్దు చేయాలి

- ఎపి వెలుగు విఒఎ ఉద్యోగుల సంఘం

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

రాష్ట్రంలో వరద ముంపునకు గురైన ప్రాంతాల్లో పొదుపు సంఘాల సభ్యులకు అన్ని రకాల రుణాలను రద్దు చేయాలని ఎపి వెలుగు విఒఎ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ రూపాదేవి, కె ధనలక్ష్మి, కోశాధికారి ఎ తిరుపతయ్య బుధవారం రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సిఇఒ వీరపాండ్యన్‌కు వినతిపత్రం అందజేశారు. పొదుపు మహిళలు ముంపు గ్రామాలపై ఆధారపడి పనిచేస్తున్న కూలీలకు అన్ని రకాల రుణాల వాయిదాల చెల్లింపులను నాలుగు నెలలపాటు వెసులుబాటు కల్పించాలని కోరారు. సంఘాలకు రూ.లక్ష రివాల్వింగ్ ఫండ్ ఇవ్వాలని కోరారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో దెబ్బతిన్న చిరు వ్యాపార సభ్యులకు, రైతు, కౌలు రైతులకు నష్టపరిహారం, పునరుద్ధరణకు కొత్త రుణాలు మంజూరు చేయాలని కోరారు.

## వన్యప్రాణులను రక్షిస్తూనే అభివృద్ధి పనులు : డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అభయారణ్యాల్లో, కారిడార్లలో ఉన్న వన్యప్రాణులను రక్షిస్తూనే అభివృద్ధి పనులను చేపట్టాలని డిప్యూటి సిఎం పవన్ కల్యాణ్ అన్నారు. బుధవారం రాత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన రాష్ట్ర వన్యప్రాణి బోర్డు స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వన్యప్రాణి సంరక్షణతో పాటు భారతమాల పరియోజన ద్వారా చేపట్టే నాలుగువరుసల రోడ్డు నిర్మాణం, షార్ సమీపంలో తీరప్రాంత రక్షణ, జెట్టీ నిర్మాణం, కడప -రేణిగుంట మధ్య రైల్వే లైన్‌లో రోడ్ల నిర్మాణాలకు శాఖ పరంగా అనుమతులపై చర్చించారు. వీటికి సంబంధించి అనుమతులు ఇచ్చే సందర్భంలో అవసరమైన ఉపశమన ప్రణాళికలు కూడా పరిగణలోకి తీసుకోవాలని పవన్‌కల్యాణ్ సూచించారు. ఈ సమావేశంలో అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంతరాము, పిసిసిఎఫ్ ఎకె నాయక్, స్టాండింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# సమగ్ర శిక్షాలో 25 వేల మందికి బకాయిలు

- వెంటనే చెల్లించాలని కోన శశిధర్‌కు వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సమగ్ర శిక్షా పరిధిలో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 25 వేలమంది కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, పార్ట్ టైమ్ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు లేక ఇబ్బంది పడుతున్నారని ఎపి సమగ్రశిక్షా కాంట్రాక్టు అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ పేర్కొంది. ప్రతినెలా మొదటి తేదీకి వేతనాలు చెల్లించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ పాఠశాల విద్య సెక్రటరీ కోన శశిధర్‌ను పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, సమగ్రశిక్షా జెఎసి గౌరవ అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, కో-ఛైర్మన్ నాగరాజు, జాన్ మూడి, ఛైర్మన్ బి కాంతారావు, ప్రధాన కార్యదర్శి యు కల్యాణి కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వేతనాల బడ్జెట్ రెండు రోజుల్లో విడుదల చేస్తామని, సమ్మెకాలం వేతనాలు, ఇతర ఒప్పందాలను మంత్రితో మాట్లాడి పరిష్కరిస్తామని అన్నారు. సమగ్రశిక్షా ఎస్‌పిడి బి శ్రీనివాసరావును కలిసిన నేతలు ఎస్‌ఎస్‌ఎలో ఖాళీలన్నింటినీ భర్తీ చేయాలని, కెజిబివిలోని టీచింగ్, నాన్ టీచింగ్ నియామకాల్లో ప్రస్తుతం పనిచేస్తున్న వారికి ప్రాధాన్యతిచ్చి నియమించాలని, ఐఇఆర్‌టిల సమస్యలు పరిష్కరించాలని, స్కూల్ కాంప్లెక్స్‌ల కుదింపు నేపథ్యంలో సిఆర్‌ఎమ్‌టిలందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

సంపాదకీయం


# డిపాజిట్ల సంక్షోభం

'బండికి రెండు చక్రాలు ఎలాగో బ్యాంకింగ్ రంగానికి డిపాజిట్లు, రుణాలు కూడా అటువంటివే. దేశ ఆర్థిక వ్యవస్థకు అత్యంత కీలకమైన బ్యాంకింగ్ రంగం సజావుగా సాగాలంటే డిపాజిట్లు, రుణాల నడక కూడా సక్రమంగా ఉండాలి.' కొద్ది రోజుల క్రితం రిజర్వు బ్యాంకు గవర్నర్ శక్తికాంత దాస్ అన్న మాటలివి! బ్యాంకింగ్ రంగం డిపాజిట్ల సంక్షోభం ఎదుర్కుంటోందంటూ వార్తలు వచ్చిన నేపథ్యంలో జరిగిన రిజర్వుబ్యాంకు బోర్డు సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. డిపాజిట్లకు, రుణాలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించాలని, డిపాజిట్లుగా వచ్చిన నిధులను అవసరమైన వారికి రుణాలుగా ఇవ్వాలని చెప్పారు. ఈ సమావేశానికి హాజరైన ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ డిపాజిట్ల సేకరణ కోసం ఆకర్షణీయమైన, వినూత్న పథకాలను ప్రవేశ పెట్టాలని చెప్పడంతో పాటు, మరికొన్ని సూచనలు చేశారు. రిజర్వుబ్యాంకు తాజాగా విడుదల చేసిన గణాంకాల ప్రకారం జూన్ 2023 నాటికి మొత్తం దేశీయ డిపాజిట్లు 4.8 శాతం తగ్గినట్లు నివేదిక పేర్కొంది. 1995 తరువాత వార్షిక డిపాజిట్లలో ఈ స్థాయి తగ్గుదల నమోదు కావడం ఇదే మొదటిసారి. గత ఏడాది 43.5 శాతంగా ఉన్న కరెంటు అకౌంట్, సేవింగ్స్ అకౌంట్ (సిఎఎస్ఎ) డిపాజిట్లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 41 శాతానికి తగ్గాయి. ఇది దాదాపుగా కరోనా వ్యాప్తికి ముందున్న సంవత్సరాలకు సమానం! రిజర్వు బ్యాంకుతో పాటు ఎస్‌బిఐ నివేదిక కూడా ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. రానున్న రోజుల్లో ఈ క్షీణత మరింతగా కొనసాగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ స్థాయిలో బ్యాంకుల్లో డిపాజిట్లు తగ్గడానికి దారితీసిన అసలైన కారణాలను రిజర్వుబ్యాంకు గానీ, ప్రభుత్వంగానీ గుర్తించిందా అన్నదే అసలైన ప్రశ్న!

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో (ఏప్రిల్ నెలలో) రిజర్వుబ్యాంకు విడుదల చేసిన నివేదిక ప్రకారమే మన దేశంలో పొదుపు గణనీయంగా పడిపోయింది. దేశంలోని కుటుంబాల నికర పొదుపు 47 ఏళ్ల కనిష్టానికి పడిపోయిందని ఆ నివేదికలో రిజర్వు బ్యాంకు పేర్కొంది. 2022లో దేశ జిడిపిలో 7.3 శాతంగా ఉన్న పొదుపు 2023లో 5.3 శాతానికి పడిపోయింది. బ్యాంకుల డిపాజిట్లతో పాటు స్టాక్స్‌ను కూడా పరిగణలోకి తీసుకుని ఈ పొదుపు లెక్కలను ఆర్‌బిఐ రూపొందించడం గమనార్హం. ఆ నివేదికలోనే కుటుంబాల అప్పులు గణనీయంగా పెరుగుతున్నాయని కూడా ఆర్‌బిఐ పేర్కొంది. 2023 ఆర్థిక సంవత్సరంలో ఈ రుణాల మొత్తం దేశ జిడిపిలో 5.8 శాతంగా ఉంది. 1970 తరువాత కుటుంబాల రుణం ఈ స్థాయిలో పెరగడం ఇది రెండోసారి! అప్పులు పెరిగితే కష్టపడి సంపాదించిందంతా దానిని తీర్చడానికే సరిపోతుందన్న విషయం ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇక పొదుపు చేయడానికి అవకాశం ఎక్కడిది? ఒకప్పుడు పొదుపు చేయడమంటేనే వివిధ దేశాల్లోనే ప్రజలు భారత్‌ను గుర్తుచేసుకునే వారు. చుక్కలను దాటి పరుగులు తీస్తున్న ధరలు ఆ పరిస్థితిని మార్చివేస్తున్నాయి. కనీస అవసరాలను తీర్చుకోవడానికే సామాన్యులు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.


మార్కెట్ అధ్యయన సంస్థ కాంతర్ రెండు రోజుల క్రితం విడుదల చేసిన ఒక నివేదిక సామాన్యులపై ధరాఘాతం ఏ స్థాయిలో ఉందో తెలియచేస్తోంది. దేశ వ్యాప్తంగా వివిధ నగరాల్లో ఈ సంస్థ చేసిన అధ్యయనం ప్రకారం నిత్యావసరాల కోసం 2022వ సంవత్సరం ఏప్రిల్, మే, జూన్ (త్రైమాసికం)లో చేసిన ఖర్చు కంటే ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో 18 శాతం అధికంగా భారతీయ కుటుంబాలు ఖర్చు చేశాయి. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేశామని ప్రభుత్వం ప్రకటిస్తున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో భిన్నమైన పరిస్థితులున్నాయని ఈ నివేదికలో పేర్కొన్నారు. ఈ కాలంలో ఔషధాల వ్యయం కూడా రెట్టింపైంది. పిల్లల చదువులు, పెళ్లిళ్లు, ఇంటి అద్దెలు వంటివి దీనికి అదనం! పెరిగిన ఖర్చులకు తగ్గట్టుగా ప్రజల నిజ వేతనాలు పెరగడం లేదన్నది సుస్పష్టం. కొంచెం అటుఇటుగా పట్టణ ప్రాంతాలతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లోనూ కొనసాగుతున్న ఈ పరిస్థితులను మార్చాలంటే ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలి. అధిక ధరలకు కళ్లెం వేయాలి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెద్ద ఎత్తున కల్పించాలి. అప్పుడే ప్రజల చేతుల్లో డబ్బు ఉంటుంది. పొదుపు చేయడం సాధ్యమవుతుంది. ఈ చర్యలు తీసుకోకుండా వడ్డీ రేట్లను పెంచినా ఫలితం శూన్యం!

మహనీయుల మాట



జీవితంలో మనం నేర్చుకున్న ప్రతిదీ ఏదో ఒక రోజు ఉపయోగపడుతుంది.

- ఐన్‌స్టీన్,
పసిద్ధ శాస్త్రవేత్త



# మహాకవి జాషువా జీవితం-పిరదౌసి ఒక సందేశం

సందర్భం



డా॥ కత్తి పద్మారావు

మహాకవి జాషువా రచించిన కావ్యాల్లో 'నా కథ' మూడు భాగాలు చాలా గొప్పవి. ప్రపంచ సాహిత్యంలో జీవిత కథకు చాలా ప్రాధాన్యత ఉంది. అటువంటి జీవిత కథలు పద్యంలో రాసిన వారిలో జాషువా అగ్రగణ్యుడు. ఆయన జీవిత కథకి, 'పిరదౌసి' కథకి ఎంతో సారూప్యం ఉన్నందువల్ల 'పిరదౌసి'లో కూడా ఆయన జీవిత కథనాన్ని వినిపించాడు.

జాషువా కవి నీటి అలల్లో నుంచి, శృతిని వినిపించగల సంగీతజ్ఞుడు. ఆయన కవిత్వంలో సంగీతం వుంది. సంగీత సాహిత్య సమన్వయుడు ఆయన. ఆయన కవిత్వంలో ఉన్న సంగీతం కృత్రిమమైనది కాదు. ప్రకృతి లోంచి వస్తున్న 'ఝుంకార ధ్వని'. అందుకే అడవిలో సింహ నాదం కొన్నిసార్లు వినిపిస్తుంది. పక్షుల గువ్వల మోతలు కొన్నిసార్లు వినిపిస్తాయి. సాలీడుల జీవన సౌందర్యాన్ని ఒకసారి చూపిస్తాయి. ఆయన ఏ చిత్రం గీసిన అది మన కళ్ల ముందు దృశ్యీకృతమవుతుంది. ఆయన రచనలు అన్నింటిలో కూడా 'నా కథ' చాలా గొప్ప కావ్యం. సత్యభాషణా చాతుర్యంతో దానిని రచిస్తాడు. ఆయనకి అసత్యం రాదు. జీవిత రహస్యాలను ఆయన ప్రకృతిలో మేళవించి చెప్పు చాతుర్యం కలవాడు. 'జాషువా' తన ఆత్మ కథను రాస్తూ ఇలా విశ్లేషిస్తాడు.

సాధారణంగా విఖ్యాత మహాపురుషులు స్వీయ చరిత్రలు వ్రాసుకొంటూ యుంటారు. అట్టివారి మనుగడలు సమగ్రంగా తెలిసికోవలెనని ప్రజలుబలాటపడుతూ యుంటారు. అందుత్తమ గ్రంథాలకు సాహిత్య రంగంలో అర్హస్థానం కూడా యుంటుంది. ఆత్మకథాకర్తలు పెక్కురు ప్రాయికంగా వారి వార్ధక్యంలో కథారచనకు పూనుకోవడం అప్పటి వారి హోదాకు, పలుకుబడికి, పదవికి తగిన యుదాత్త ఘట్టాలే వ్రాసికొంటూ తమదొక విశిష్ట జన్మగా నిరూపించుకొంటూ, సత్యగోపనం చేస్తూ కథ సాగించడం పరిపాటి. అట్టి రచనలు పాఠక లోకాన్ని ఆకర్షించలేవు సరికదా కొంత అనుమానాలకు, హాస్యానికి గుణియై నిరుపయోగాలౌతాయి. మహాపురుషులు నిత్య జీవితంలో వారనుభవించిన కష్టసుఖాలు పొందిన గౌరవాగౌరవాలు, వయ:పరిపాకంలో నెదుర్కొన్న క్లిష్ట సమస్యలు యథాతథంగా చిత్రించి, తాము నడచిన త్రోవ సర్వజన సులభమని వారార్జించిన కీర్తి ప్రతిష్ఠ అనన్య సాధ్యాలుగావని నిరూపిస్తూ ఒక ఆశాకిరణాన్ని వెలిగిస్తూ యుంటారు. ప్రపంచ మహాపురుషుల జీవిత చరిత్రల్ను పరిశీలిస్తే ఈ సత్యం ఋజువౌతుంది. గాంధీ, నెహ్రూ, బోసు, టాగోరు ప్రభృతుల ఆత్మకథ లీకోవలోవి. వారి బాల్య యౌవన కౌమార ఘట్టా లాదర్శాలవలె స్వచ్ఛమై ఆయా కాలాలలో వారి మూర్తులను కన్నులగట్టుతూ హృదయంగమంగా యుంటయి. గౌరవ భంగ భయంతో వారు దాచుకొన్న స్వీయదోషా లందుండవు. స్వీయ చరిత్రలకీ లక్షణా లాయుర్ధాయాలు-అలంకారాలు.

అట్టి ప్రసిద్ధ పురుషుల జాబితాలో చేరవలెననే ఆశతో నేనీ గ్రంథ రచన చేయడం లేదు. 'క్షుభిత మనశ్శాంతికి గత చరిత్ర ధ్యానంకన్న బ్రహ్మానందం లేద'న్న ఒకానొక ఆంగ్ల కవి వాక్రుచ్చినట్లు ఏకాంతంగా నేను నా జీవిత గ్రంథాన్ని మనస్సులో చదువుకొంటూ సింహావలోకనం చేసుకొంటూ మైమఱచిన నిశీథాల సంఖ్యాకాలు. దాదాపు నలుబదేండ్ల నా భాషా పరిశ్రమలో అనుభవమిది. ప్రసిద్ధాంధ్ర కవులు మ్రోయించిన కవితావీణెలు నా పసితనంలో నన్నాకర్షించినయి. ఊగించినయి, ఊరించినయి. నేనూ ఒక వీణెమ్రోయించాలి అనుకొన్నాను. ప్రయత్నం మీద నాకు లభించింది. వీణె కాదు. సితార, అది నా కవిత. దాన్ని మ్రోయిస్తున్నాను. వినిపించింది. ప్రజలకు కాని ప్రభువులకు కాదు. అట్లు నే సాగించిన కవితా ప్రవాసంలో కొన్ని తీగెలు తెగినయి. ముడులు పడ్డాయి, బెట్లు తప్పినయి, మూగవోయినయి. కాని నిరుత్సాహిని మట్టుకు కాలేదు. పైపెచ్చు పూర్ణోత్సాహ వంతుణ్ణయి మ్రోయిస్తూనే యున్నాను. లోకం నా వంక కోరగా వారగా చూచింది. అనాదరించింది. అసత్కరించింది. సత్కరించింది. దూరపర్చింది, చేరదీసింది. ఇతరేతర ఘర్షణోన్ముఖాలైన అభిరుచులు, ఆశయాలు, దృక్పథాలు అడుగడుగున వర్ణాభిమాన వర్గాభిమాన మతాభిమానాలతో స్వేచ్ఛావిహారం చేసే నేలలో అకలంక కళాకల్యాణులకు న్యాయం జరుగుతుందని ఆశించడం శశవిషాణప్రాయం, పర రాజ్యం పోయి, ప్రజా రాజ్యమై పాముకున్నది లేదు. కొందరికి ప్రజా రాజ్యంగా కొందరికి మజా రాజ్యంగా కొందరికి క్షుధా రాజ్యంగా తయారై అష్టకష్టాల కాలవాలమైంది. విద్యాభివృద్ధి తప్ప విజ్ఞాన వృద్ధి శూన్యమై వింత ప్రకృతులతో విఱ్ఱవీగుతుంది. నిజాయితి నిండుకొన్నది. మూఢతా జలనిధి జడనిధియై స్తంభించి పోయింది. మేడలు పెరిగి మేధస్సు తరిగింది. ఫలశూన్యాలైన పైపై నవ్వులు, పల్కరింపులు, ప్రణామాలు సభ్యతా చిహ్నాలైనయి. వన ప్రతిష్ఠలు, శిథిల శిలాఖండ పునరుద్ధరణలు, ఉరుసులు, ఉత్సవాలు, దేశాభ్యుదయ సాధనాలై బక్కపేదల డొక్కల నూరించి కారిస్తూయున్నయి. పురోగమనం తిరోగమనమైంది. ఆంధ్రకవు లంత:పురాంగన కలరు. మాలలల్లి యలంకరణలు చేస్తూ పాతపుంతలో పల్లటీలు కొడుతూ పచార్లు సారిస్తూన్నారు. ఎవరికివారై యమునా తీరాన మున్ను కట్టుకొన్న గుడిసెలిప్పుడున్నత సౌధాలై కంచెలు వైచికొన్నయి. పూర్వ మన్నాదమ్ములు, నేడు బ్రదర్లు, భాయీలు భాషలో మార్పు తప్ప ప్రకృతిలో మార్పు లేదు.

ఈ నవ్య యుగం చేసే విచిత్ర నగ్న నాట్య రభసచే నాలో రేగిన వృథా వాత్యకుక్కిరి బిక్కిరై ఒకానొక రాత్రి నాజీర్ణ జీవిత గ్రంథాన్ని సింహావలోకనం చేసికొన్నాను. జన్మస్థలాన్ని, జననీజనకుల్ని నాటి నేటి రాజకీయ సాంఘిక వ్యవస్థల్ని పరిశీలించి చూచుకొన్నాను. మనశ్శాంతికై కలము పట్టుకొన్నాను. అందలి ప్రథమ నిశ్వాసమే.

జీవిత చరిత్ర రాయడం చాలా కష్టం. అది సత్య నిష్ఠతో కూడుకున్నది. చాలామంది తన జీవిత చరిత్రను రాసి ప్రజలను మెప్పించలేకపోయారు. కారణం వారు జీవితాన్ని అనుభవించలేకపోవడం. జీవితాన్ని అనుభవిస్తేగాని పవలరించలేము. అందుకే 'నా కథ' జగత్ ప్రసిద్ధమైనది. ఆయన తన ఊరిని తల్లి అని సంబోధించాడు. ఊరిలో వున్న అన్ని దేవాలయాల గురించి ప్రస్తావించాడు. తల్లిదండ్రులకు నేను గారాల సుతుడను అని పేర్కొంటాడు. ఏనుగు మీద గండపెండెరంతో ఊరేగించారని ఆత్మగౌరవంతో చెప్పాడు. వినుకొండ ప్రాశస్త్యాన్ని గురించి చెప్పాడు. టిప్పు సుల్తాన్ కట్టించిన మసీదు విశిష్టతను వివరించాడు. కనకదుర్గను పొగిడాడు. శివాలయాన్ని దర్శింపచేశాడు. చివరకు వినుకొండ ఊరును మనకు దృశ్యీకరింప చేశాడు.

**కం. ననుగాంచి పెంచి నాలో**
**గొనబుం గవనమును, పాదుకొల్పిన తల్లీ!**
**నను మరచిన నిను మరవను**
**వినుకొండా! నీకు నా పవిత్ర ప్రణతుల్.**

**కం. వీరయకు లింగమాంబకు**
**గారాల సుతుండ కవిని గంధగజముపై**
**నూరేగి చరణమున పెం**
**డారంబు ధరించినాడ నలువురు మెచ్చన్.**

ఆయన ఊరిని ఎంత ప్రేమించాడో దేశాన్ని అంత ప్రేమించాడు. ప్రపంచాన్ని ఆవాహన చేసుకున్నాడు. ఆయన తెలుగువారి సంస్కృతికి అద్దం పట్టాడు. ఆయన కేవలం అక్షర విద్య వలన జ్ఞానం రాదు అన్నాడు. జ్ఞానం నిరంకారులకు, జీవన సత్యాలు తెలుసుకునేవారికి మానవతా స్ఫూర్తి కలిగిన వారికి, మాత్రమే వస్తుంది అన్నాడు. మొదటి నుంచి ఆయన మతోన్మాదాన్ని నిరసిస్తూ మతద్వేషాన్ని నిరసిస్తూ, మనవతా సౌజన్యాలు విరజిమ్ముతూ కవిత్వాన్ని నడిపించాడు. ఆయన జీవిత కథలోకి వెళ్దాం.

**కం. గౌరియల మేకల నెత్తుటి**
**ఘురముల నిర్దోషమునను జర్జరితంబై**
**కరిగినవి గిరులు శ్రుతగిరి**
**కరుగదనిన అపయశంబు గాదే మనకున్.**

**సీ. కృపలేని నీదు కొంచెపు దృష్టి బాధింప**
**కన్నీరు చిందిన కవనపటిమ**
**దరిలేని నీ యనాదరణ మాటున మ్రగ్గి మంటి**
**పాలైన సమత్వ సుఖము**
**ముక్కిపోయిన నీదు మూఢతా జడనిధి మునిగి**
**యిప్పటికి కోల్కొనని చదువు**
**ఫలమింతలేని నీ భజన కూటములచే ఖర్చైన**
**యౌవన కాల నియతి.**

ఇకపోతే మహాకవి జాషువాకి నవయుగ చక్రవర్తి అనే బిరుదు రావడం గురించి కొండవీటి వేంకట కవి నాతో ఇలా చెప్పారు. త్రిపురనేని రామస్వామి చౌదరి గారికి కవిరాజు బిరుదునిచ్చారు. తుమ్మల సీతారామమూర్తి గారికి తెలుగు లెంక బిరుదునిచ్చారు. కొత్త సత్యన్నారాయణ చౌదరి గారికి మహాపండిత్ బిరుదునిచ్చారు. నాకు కూడా కవిరాజు బిరుదునిచ్చారు. అయితే మహాకవి గుర్రం జాషువా గారికి మాత్రం నవయుగ కవి చక్రవర్తి అని బిరుదునిచ్చారు. మేము శూద్ర కవులం. ఆయన పరిచయ కవి అయినా ఆయనకి నవయుగ చక్రవర్తి అనే బిరుదు వచ్చింది. ఆయనను ఏనుగు మీద ఊరేగించారు అని చెప్పారు. అప్పటి శూద్ర కవుల కంటే కూడా జాషువా గారికి గొప్ప కీర్తి ప్రతిష్ఠలు రావడానికి కారణం ఆయన కవిత్వంలో 'ఊరు', 'వాగు', 'కొండలు', 'పక్షులు', 'జీవితం', 'దు:ఖం', 'నీతి', 'వ్యక్తిత్వం' ఉంటాయి అని కొండవీటి వేంకట కవి చెప్పారు.

జాషువా కవిత్వంలో శిల్ప రహస్యాలున్నాయి. ముఖ్యంగా ఆయన తెలుగు నుడికారాన్ని పలుకుబడినీ, సామెతనీ, కవిత్వంలో మేళవించారు. ఆయన సామాన్యంగా పద్యాన్ని పూర్తి చేయడు. ఆయన పద్యం రాసే పద్ధతి గురించి 'పిరదౌసి' కావ్యంలో ఇలా చెప్పారు.

**ఒక్కొక పద్దియంబునకు నొక్కొక**
**నెత్తురుబొట్టు మేనిలో**
**దక్కువగా రచించి వృథాశ్రమ యయ్యె**
**గులీనుడైన రా**
**జిక్కరణిన్ మృష ల్వలుకునే? కవితాఋణ**
**మీయకుండునే**
**నిక్క మెఱుంగనైతి గజనీసులతాను**
**మహమ్మదగ్రణీ.**

నిజానికి 'పిరదౌసి' జీవితం గుఱ్ఱం జాషువా జీవితానికి దగ్గరగా వుంది. జాషువా జీవితం సుసంపన్నమైంది. కథనాత్మకమైంది. ఆదర్శ ప్రాయమైంది. అందులో దు:ఖం ఉంది. నైతికత ఉంది. పోరాటం ఉంది. ఆవేదన ఉంది. సందేశం ఉంది. అందుకే ఆయన జయంతి రోజున మనమందరం ఘన నివాళి అర్పిద్దాం.

/ వ్యాసకర్త సెల్ : 9849741695 /



> 'క్షుభిత మనశ్శాంతికి గత చరిత్ర ధ్యానంకన్న బ్రహ్మానందం లేద'న్న ఒకానొక ఆంగ్ల కవి వాక్రుచ్చినట్లు ఏకాంతంగా నేను నా జీవిత గ్రంథాన్ని మనస్సులో చదువుకొంటూ సింహావలోకనం చేసుకొంటూ మైమఱచిన నిశీథాల సంఖ్యాకాలు. దాదాపు నలుబదేండ్ల నా భాషా పరిశ్రమలో అనుభవమిది. ప్రసిద్ధాంధ్ర కవులు మ్రోయించిన కవితావీణెలు నా పసితనంలో నన్నాకర్షించినయి. ఊగించినయి, ఊరించినయి. నేనూ ఒక వీణె మ్రోయించాలి అనుకొన్నాను. ప్రయత్నం మీద నాకు లభించింది. వీణె కాదు. సితార, అది నా కవిత. దాన్ని మ్రోయిస్తున్నాను. వినిపించింది. ప్రజలకు కాని ప్రభువులకు కాదు. అట్లు నే సాగించిన కవితా ప్రవాసంలో కొన్ని తీగెలు తెగినయి. ముడులు పడ్డాయి, బెట్లు తప్పినయి, మూగ వోయినయి. కాని నిరుత్సాహిని మట్టుకు కాలేదు. పైపెచ్చు పూర్ణోత్సాహ వంతుణ్ణయి మ్రోయిస్తూనే యున్నాను. లోకం నా వంక కోరగా వారగా చూచింది. అనాదరించింది. అసత్కరించింది. సత్కరించింది. దూరపర్చింది, చేరదీసింది.

సెప్టెంబర్ 28న జాషువా129వ జయంతి

# ఆర్థికాభివృద్ధిలో మోడీ ప్రభుత్వ వైఫల్యం

విశ్లేషణ

ఎ. కోటిరెడ్డి

దేశ ఆర్థిక వ్యవస్థను అగ్రస్థానానికి తీసుకెళతామని మోడీ ప్రభుత్వం మనల్ని ఊహాలోకంలో విహరింపజేస్తుంటే వాస్తవాలు వెక్కిరిస్తున్నాయి. దేశం నుండి జరుగుతున్న ఎగుమతుల పతనంలో ఇది స్పష్టంగా కనిపిస్తున్నది. దేశ ఆర్థిక వ్యవస్థలో అభివృద్ధి జరుగుతున్న మేరకు కూడా ఎగుమతుల పెరుగుదల ఉండటం లేదని, బంగ్లాదేశ్, వియత్నాం లాంటి దేశాలు మన ఎగుమతి మార్కెట్లను కైవసం చేసుకుంటున్నాయని ప్రపంచ బ్యాంకు విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. గత దశాబ్దంలో భారతదేశ జిడిపి పెరుగుదల ఎక్కువగా ఉన్నప్పటికీ ఎగుమతులు క్షీణిస్తున్నాయని ఆ నివేదికలో చెప్పింది.

దేశం నుండి బట్టలు, తోలు వస్తువులు, రెడీమేడ్ బట్టలు, చెప్పులు తదితరాల ఎగుమతులు 2002లో 0.9 శాతంగా ఉన్నాయి. 2013 నాటికి 4.5 శాతానికి పెరిగి, 2022 నాటికి 3.5 శాతంకు పడిపోయాయి. ఇందుకు భిన్నంగా 2022లో బంగ్లాదేశ్ ఎగుమతులు 5.1 శాతానికి, వియత్నాం ఎగుమతులు 5.9 శాతానికి పెరిగాయి. సరుకుల తయారీ రంగంలో మన దేశాన్ని ప్రపంచానికి కేంద్రంగా మారుస్తానని మోడీ ప్రచారం చేస్తుండగా, మన దేశం చిన్న దేశాలతో కూడా పోటీ పడలేక, ఎగుమతి మార్కెట్లను వారికి సమర్పించుకొంటున్నది. ఎగుమతుల రంగంలో మనలను వెనక్కు నెడుతున్న బంగ్లాదేశ్, వియత్నాంలు ప్రపంచ ఆర్థిక అభివృద్ధి సూచీలో 35వ స్థానంలో ఉన్నాయి. బంగ్లాదేశ్ జిడిపి 455 బిలియన్ డాలర్లు కాగా, వియత్నాం జిడిపి 352 బిలియన్ డాలర్లుగా ఉన్నది. 2024లో భారతదేశం 3.95 ట్రిలియన్ డాలర్ల జిడిపితో ప్రపంచంలో ఐదవ పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్నది. వియత్నాం కన్నా 10 రెట్లు, బంగ్లాదేశ్ కన్నా ఏడు రెట్లకు మించి మన ఆర్థిక వ్యవస్థ ఉన్నది. అయినా ఎగుమతులలో వెనుకబడటంతో మన వాణిజ్య లోటు పెరిగిపోతున్నది.

**సామ్రాజ్యవాదులకు లొంగిపోవటమే మేకిన్ ఇండియా**

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలే మన దేశం తయారీ రంగంలో వెనుకబడటానికి ప్రధాన కారణం. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత 'మేడిన్ ఇండియా' విధానాన్ని పక్కన పెట్టి, 'మేకిన్ ఇండియా' నినాదం ఇచ్చారు. మేడిన్ ఇండియా అంటే భారతదేశంలోనే సరుకులను తయారు చేసే పరిశ్రమలను ఏర్పాటు చేయాలి. ఇక్కడే సరుకులను




తయారు చేయాలి. కాని మేకిన్ ఇండియా అంటే సరుకుల తయారీ పరిశ్రమలను దేశంలో ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదు. పరిశ్రమలను ఏ దేశంలో నైనా ఏర్పాటు చేసుకోవచ్చు. విడి భాగాలను ఎక్కడైనా తయారు చేసుకోవచ్చు. విడిభాగాలను ఏ దేశం నుండి దిగుమతి చేసుకున్నా, వాటిని మన దేశంలో కూర్చి, ఒక వినియోగ సరుకుగా తయారు చేస్తే అది మనదేశంలో తయారైనట్లుగానే పరిగణిస్తున్నారు. ఇదే మేకిన్ ఇండియా. ఇదేమీ మోడీ బుర్రలో పుట్టిన ఆలోచన కాదు. ప్రపంచ బ్యాంకుకు బుర్రను అప్పగిస్తే వారు సామ్రాజ్యవాదులకు ఉపయోగపడే ఇటువంటి ఆలోచనలను ఎక్కించి, తమ స్వంత ఆలోచనలుగా ప్రచారం చేసుకోమని సలహా ఇస్తారు. తమ విధానాలను అధికారంలో ఉన్న నాయకుల సృజనాత్మక ఆలోచనలుగా ప్రపంచబ్యాంకు ప్రచారం చేయిస్తుంది. ఆ విధంగా తమ విధానమైన మేకిన్ ఇండియాను మోడీ, బిజెపి చేత ప్రచారం చేయించి, ఇదేదో మోడీ బుర్రలో పుట్టిన సృజనాత్మక ఆలోచనగా ముద్ర వేయటానికి ప్రయత్నించారు. ప్రస్తుతం ఎక్కడైతే కార్మికుల వేతనాలు తక్కువగా ఉన్నాయో అక్కడికి బహుళజాతి సంస్థలు తమ పరిశ్రమలను తరలిస్తున్నాయి. భారతదేశంలో కార్మికుల వేతనాలు, పన్నులను తగ్గించాలని, మరింత ఎక్కువగా రాయితీలు ఇవ్వమని ప్రపంచబ్యాంకు నివేదికలో పేర్కొన్నది. ప్రపంచబ్యాంకు ప్రతిపాదిత విధానాలు మన తయారీ రంగ పునాదిని దెబ్బ తీస్తాయి. మనల్ని మరింతగా దిగుమతులపై ఆధారపడేలా చేస్తాయి.

**తయారీ రంగంలో తీసుకోవలసిన చర్యలు**

సరుకుల ఉత్పత్తిలో దేశం అగ్రస్థానంలోకి రావటం కోసం మొదటగా దేశంలో కార్మికులు, కర్షకులు, మేధావులు, స్వయం వృత్తులు, ఉపాధులు పొందుతున్న, కష్టజీవులు సృష్టిస్తున్న సంపదను ప్రజలందరికీ పున:పంపిణీ చేయాలి. ప్రజల కొనుగోలు శక్తిని పెంచటం కోసం కార్మికుల వేతనాలు, కూలీల కూలి రేట్లు, రైతుల, చేతివృత్తిదారుల ఆదాయాలను పెంచే చర్యలు తీసుకోవాలి. ఖాళీగా ఉన్న ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలలోని ఉద్యోగాలన్నింటిని తక్షణమే భర్తీ చేయాలి. ఏ రంగంలోనైనా నెలకు కనీస వేతనం 25 వేల రూపాయలుగా నిర్ణయించాలి. నిరుద్యోగులకు ఉద్యోగాలిచ్చే వరకు నిరుద్యోగ భృతి ఇవ్వాలి. ఉపాధి హామీ చట్టాన్ని మరింత విస్తరింపజేయాలి. డబ్బు లభ్యత, పని రోజులపై ఎటువంటి పరిమితిని విధించరాదు. ఇటువంటి చర్యలు తీసుకొంటే మెజారిటీ ప్రజల ఆదాయం, వారి కొనుగోలు శక్తి పెరుగుతాయి. దేశంలో ఉన్న సరుకులను ఉత్పత్తి చేసే పరిశ్రమలకు ఊపు వస్తుంది. కొత్త పరిశ్రమలను నిర్మించాల్సిన అవసరం ఏర్పడుతుంది. అపుడు దేశం తయారీ సరుకుల ఉత్పత్తిలో అగ్రగామిగా మారటానికి అవసరమైన పునాది ఏర్పడుతుంది. మన లక్ష్యం మేకిన్ ఇండియా కాదు, మేడిన్ ఇండియాగా ఉండాలి.

మన దేశం స్వతంత్రంగా అభివృద్ధి కావటానికి అవసరమైన విధానాలను పక్కన పెట్టి, ప్రపంచబ్యాంకు, ఐ.ఎం.ఎఫ్, సామ్రాజ్యవాద దేశాలు రుద్దుతున్న విధానాలను మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్నది. సామ్రాజ్యవాదులపై ఆధారపడి అభివృద్ధి సాధించాలని ప్రభుత్వం భావిస్తున్నది. ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్, సామ్రాజ్యవాదుల విధానాలు మన లాంటి దేశాల కోసం రూపొందించినవి కాదు. సామ్రాజ్యవాదుల లాభాల కోసం రూపొందించినవి. కాబట్టి మనకు ఉపయోగపడవు.

**సరుకుల ధరలను తగ్గించటానికి రెండు వాదనలు**

ఎగుమతులను పెంచుకోవాలన్న చర్చ జరుగుతున్నది. కార్మికుల శ్రమను మరింతగా దోపిడి చేయటం ద్వారా సరుకుల ధరలను తక్కువగా ఉంచి, మన సరుకులను ప్రపంచ మార్కెట్‌లో నింపాలని కొందరు వాదన చేస్తున్నారు. కార్మికులను దోపిడి చేయటం కోసం వేతనాలను తగ్గించటం, వారికిచ్చే సదుపాయలను రద్దు చేయటం, వారి చేత ఎక్కువ గంటలు పని చేయించటం, పెన్షన్ లేకుండా చేయటం, పి.ఎఫ్, ఆరోగ్య సదుపాయాలు తదితరాలను కుంచింపజేయాలని వీరు చెబుతున్నారు. ఈ విధంగా చేయటం ద్వారా యజమానులు కార్మికులపై పెట్టే ఖర్చు తగ్గుతుంది. ఆ మేరకు వారు తయారు చేసే సరుకుల ధరలు కూడా తగ్గుతాయి. అయితే ఈ విధంగా చేయటం ద్వారా కోట్లాది మంది కార్మికులు, కష్టజీవుల ఆదాయాలు తగ్గిపోతాయి. వారి జీవన ప్రమాణాలు దిగజారతాయి. కొనుగోలు శక్తి తగ్గుతుంది. దానితో అంతర్గత మార్కెట్ కూడా కుంచించుకుపోతుంది. దేశ ఆర్థిక వ్యవస్థ సంక్షోభానికి దగ్గరౌతుంది. కార్మికులు, కర్షకులు, కష్టజీవుల ఆదాయాలను తగ్గించటానికి పూనుకున్న ప్రభుత్వం దేశాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెడుతుందని అనుభవాలు స్పష్టం చేస్తున్నాయి.

కార్మికులు, కర్షకుల ఆదాయాలను తగ్గించకుండా, ఉత్పాదకతను పెంచటం ద్వారా సరుకుల ధరలను తగ్గించటం మంచి ప్రత్యామ్నాయం అవుతుందని మరో వైపున వాదిస్తున్నారు. ఉత్పత్తి రంగంలో నూతన ఆవిష్కరణలపై కేంద్రీకరించి, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించటం ద్వారా శ్రమ ఉత్పాదకతను పెంచి, సరుకుల ధరలను తగ్గించవచ్చు. ఆ విధంగా చేయటం ద్వారానే చైనా ప్రపంచ సరుకుల తయారీ కేంద్రంగా అభివృద్ధి చెందింది. ప్రజల ఆదాయాలను పెంచటం ద్వారా అంతర్గత మార్కెట్‌ను విస్తరింపజేసుకున్నది. నూతన ఆవిష్కరణలపై కేంద్రీకరించి, అట్టడుగున ఉన్న ఆర్థిక వ్యవస్థను రెండవ స్థానానికి తీసుకొచ్చింది. అనేక రంగాలలో అమెరికాను దాటి ముందుకుపోయింది.

ప్రపంచంలో అభివృద్ధిని సాధించిన దేశాలు అన్నీ తమ కాళ్ళపై నిలబడి, తమ దేశాభివృద్ధికి అవసరమైన విధానాలను స్వతంత్రంగా అనుసరించాయి. ఇతర దేశాల నుండి అనుభవాలను తీసుకున్నాయి. అటువంటి దేశాలే ఆర్థికాభివృద్ధిని సాధించాయి. ఇతర దేశాల ఒత్తిడితో విధానాలను రూపొందించిన ఏ దేశం కూడా అభివృద్ధిని సాధించలేదు. కాబట్టి ప్రస్తుతం ప్రపంచబ్యాంకు ఆదేశిత, మోడీ అమలు చేసే విధానాలు మన దేశ అభివృద్ధికి దోహదం చేయటం లేదు. సామ్రాజ్యవాదుల, దేశంలోని పెట్టుబడిదారుల ప్రయోజనాలను మాత్రమే నెరవేరుస్తున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండి ఈ విధానాలను తిప్పికొట్టాలి. ★

> **మన దేశం స్వతంత్రంగా అభివృద్ధి కావటానికి అవసరమైన విధానాలను పక్కన పెట్టి, ప్రపంచబ్యాంకు, ఐ.ఎం.ఎఫ్, సామ్రాజ్యవాద దేశాలు రుద్దుతున్న విధానాలను మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్నది. సామ్రాజ్యవాదులపై ఆధారపడి అభివృద్ధి సాధించాలని ప్రభుత్వం భావిస్తున్నది. ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్, సామాజ్యవాదుల విధానాలు మన లాంటి దేశాల కోసం రూపొందించినవి కాదు. సామ్రాజ్యవాదుల లాభాల కోసం రూపొందించినవి. కాబట్టి మనకు ఉపయోగపడవు.**

జనవాక్యం

## పేదల ఆకలి పట్టని రేషన్ డిపోలు

రాష్ట్రంలో ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా అర్హులైన పేదలకు ఉచిత బియ్యంతో పాటు రాయితీపై కందిపప్పు, పంచదారను కూడా సరఫరా చేయాల్సి ఉంది. కానీ గత నాలుగైదు నెలలుగా కార్డుదారులకు కేవలం ఒక్క బియ్యం మాత్రమే సరఫరా చేస్తూ కొన్ని ప్రాంతాల్లో అరకొరగా పంచదార ఇస్తున్నారు. పౌరసరఫరాల శాఖ మంత్రి రేషన్ డిపోలు, గోదాముల్లో తనిఖీలు చేపట్టినప్పుడు పేదలకు ఇచ్చే పంచదార, అంగన్వాడీలకు ఇచ్చే కందిపప్పు, నూనె ప్యాకెట్లు బరువు తక్కువగా ఉన్నట్లు గుర్తించి రాష్ట్ర వ్యాప్తంగా కందిపప్పు, పంచదార, నూనె ఇతర ప్యాకెట్ల పంపిణీ నిలిపేయాలని మంత్రి అధికారుల్ని ఆదేశించారు. ఇదే సాకుగా చూపుతూ జ్యుడీషియల్ ప్రివ్యూ నుంచి అనుమతులు లభించిన తర్వాత కూడా కందిపప్పు టెండర్ల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లకుండా పౌర సరఫరాల శాఖ నిలిపివేసింది. చక్కెర సరఫరాదారులు ఎక్కువ ధరలు కోట్ చేశారనే కారణంతో అధికారులు ఆ టెండరును కూడా రద్దు చేసేశారు. దీంతో గత మూడు నెలలుగా రాష్ట్రం మొత్తంగా పంచదార పంపిణీని కూడా నిలిపివేశారు. అనూహ్యంగా పెరుగుతున్న ధరలలో భాగంగా బహిరంగ మార్కెట్లో కిలో కందిపప్పు రూ.200 దాటి పోగా... పంచదార కిలో దాదాపు రూ.50 పైమాటే చేరువైంది. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వం ఇటీవల వస్తు దిగుమతులపై పన్నుల శాతాన్ని పెంచిన దరిమిలా వంటనూనెలు ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం వారు సత్వరం స్పందించి పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని రకాల నిత్యావసరాలను పూర్తి స్థాయిలో రేషన్ డిపోల ద్వారా పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలి.

- అప్పన్న గొనప

# ఇది పూర్తి స్థాయి యుద్ధమే



- లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడులపై అరబ్బు దేశాల ఆగ్రహం

**బీరుట్, గాజా :** గత ఏడాది కాలంగా గాజాలో మారణహోమాన్ని సాగిస్తూ వేలాదిమంది పాలస్తీనియన్లను పొట్టనబెట్టుకున్న ఇజ్రాయిల్ తాజాగా లెబనాన్‌పై రాక్షస దాడులకు దిగడాన్ని ఈజిప్ట్, ఇరాక్, జోర్డాన్ తదితర అరబ్బు దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఇది, పశ్చిమాసియా ప్రాంతాన్ని పూర్తి స్థాయి యుద్ధంలోకి లాగుతుందని, ఈ ప్రాంతంలో ప్రమాదకర పరిస్థితులు నెలకొని వున్నాయన్నారు. గాజాలో దురాక్రమణను అడ్డుకోవాలని వారు ఒక సంయుక్త ప్రకటనలో కోరారు.. యుఎన్ జనరల్ అసెంబ్లీ వార్షిక సమావేశాల నేపథ్యంలో వీరు సమావేశమై లెబనాన్‌లపై పెద్దయెత్తున సాగుతున్న దాడుల వల్ల తలెత్తిన ఉద్రిక్తతలపై ఈ మూడు దేశాల నేతలు చర్చించారు.

గాజాలో ఇజ్రాయిల్ ఊచకోతకు పాల్పడడాన్ని కతార్ పాలకుడు ఖండించారు. న్యూయార్క్‌లో ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో అక్కడ మాట్లాడిన పలువురు ప్రపంచ నేతలు ఇజ్రాయిల్ దురాక్రమణ చర్యలను తీవ్రంగా నిరసించారు. తక్షణమే ఈ మారణ హోమాన్ని ఆపాలని హెచ్చరించారు.

**తాజా దాడుల్లో 13మంది మృతి**

గత మూడు రోజులుగా ఇజ్రాయిల్ సాగిస్తున్న రాక్షస దాడుల్లో ఇప్పటివరకు 569మంది మరణించారు. వీరిలో 50మంది అభం శుభం తెలియని చిన్నారులు వున్నారని లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. బుధవారం నాటి దాడుల్లో 13 మంది మరణించారు. లెబనాన్ వ్యాప్తంగా జరుగుతున్న దాడులతో రక్షణ ఎక్కడ దొరుకుతుందో తెలియని అయోమయ స్థితిలో వేలాదిమంది ప్రజలు వున్నారు. వీరిలో చాలామంది దక్షిణ లెబనాన్‌ను వీడి ఉత్తర ప్రాంతాల వైపునకు వెళుతున్నారు. ఒకేసారిగా వేలాదిమంది ప్రజలు రోడ్లపైకి రావడంతో భారీగా ట్రాఫిక్ ఏర్పడింది. సాధారణంగా రెండు గంటలు పట్టే ప్రయాణం రోజంతా పడుతోంది. రాజధాని బీరుట్‌లో కూడా పూర్తి స్థాయి యుద్ధ వాతావరణం నెలకొందని అక్కడి ప్రజలు పేర్కొంటున్నారు. గత కొద్ది గంటల వ్యవధిలో ఇజ్రాయిల్ తన బాంబు దాడుల పరిధిని మరింతగా విస్తరించిందని లెబనీస్ నేషనల్ న్యూస్ ఏజెన్సీ (ఎన్ఎన్ఎ) తెలిపింది. దేశంలోని పలు ప్రాంతాల్లో 20కి పైగా వైమానిక దాడులకు తెగబడిందని పేర్కొంది. విభజన రేఖకు సమీపంలో పలు పాయింట్ల వద్ద ప్రధానంగా అర్జున్, అర్మటి, బిన్త్ పట్టణాలపై దాడులు ఉధృతంగా జరుగుతున్నాయి.

**అసమానతలు, అనిశ్చితితో కూడిన ప్రపంచానికి ప్రపంచ నేతలే కారణం: గుటెరస్**

అసమానతలు, అనిశ్చితి వైపు ప్రపంచం నెట్టబడడానికి ప్రపంచ దేశాల నేతలే కారణమని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ చెప్పారు. భౌగోళిక, రాజకీయ విభజనలు పెచ్చరిల్లిపోతున్నాయని, వాతావరణ మార్పులు, అణ్వాయుధాల ముప్పు పెరిగిపోతోందని, వీటికి కనుచూపు మేరలో పరిష్కారాలు కనబడడం లేదన్నారు. మానవత్వం అంతరించిపోతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఈనాడు మనం ఎదుర్కొంటున్న ఈ సవాళ్ళన్నీ పరిష్కరించుకోగలిగేవేనని అన్నారు.

**మొసాద్ ప్రధాన కార్యాలయంపై దాడులు**

హిజ్బుల్లా స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయిల్ గత మూడు రోజులుగా రెచ్చిపోతున్న తరుణంలో బుధవారం మొదటిసారిగా ఇజ్రాయిల్ నిఘా సంస్థ మొసాద్ ప్రధాన కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకుని ఉపరితలం నుండి ఉపరితలంపైకి ప్రయోగించే మధ్యంతర శ్రేణి బాలిస్టిక్ క్షిపణులను హిజ్బుల్లా ప్రయోగించింది. గాజాలోని పాలస్తీనా ప్రజలకు, లెబనాన్ ప్రజలకు మద్దతుగా ఖాదర్ 1 క్షిపణులను ప్రయోగించినట్లు ఒక ప్రకటనలో తెలిపింది.

# సిద్ధరామయ్యపై దర్యాప్తు జరపండి

- లోకాయుక్తకు ప్రత్యేక కోర్టు ఆదేశాలు

**బెంగళూరు :** మైసూరు పట్టణాభివృద్ధి సంస్థ (ఎంయుడిఎ) స్థలం కేటాయింపు కేసులో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై పోలీసులతో దర్యాప్తు జరపాల్సిందిగా ప్రత్యేక కోర్టు బుధవారం లోకాయుక్తను ఆదేశించింది. సిద్ధరామయ్య భార్య పార్వతికి ఎంయుడిఎ 14 స్థలాలను కేటాయించడంలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు రావడంతో సిద్ధరామయ్యపై దర్యాప్తు చేపట్టేందుకు గవర్నర్ గెహ్లాట్ అనుమతి మంజూరు చేయడాన్ని హైకోర్టు సమర్ధించింది. ఈ నేపథ్యంలో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సంతోష్ గజానన్ భట్ ఆదేశాలు వెలువడ్డాయి. ముఖ్యమంత్రిపై వచ్చిన ఫిర్యాదులపై నిర్ణయాన్ని వాయిదా వేయాలంటూ ప్రజా ప్రతినిధుల ప్రత్యేక కోర్టును ఆదేశిస్తూ ఆగస్టు 19న ఇచ్చిన తాత్కాలిక ఆదేశాలను కూడా హైకోర్టు రద్దు చేసింది. గవర్నర్ విచారణకు అనుమతించడాన్ని సవాలు చేస్తూ సిద్ధరామయ్య దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా హైకోర్టు తోసిపుచ్చింది.

# ఫీజు చెల్లించలేని దళిత విద్యార్థికి సుప్రీం భరోసా

**న్యూఢిల్లీ :** గడువులోగా ఫీజు చెల్లించలేకపోవడం వల్ల ఐఐటి సీటు కోల్పోయిన నిరుపేద దళిత విద్యార్థికి సాయం చేస్తామని సుప్రీం కోర్టు భరోసా ఇచ్చింది. సీటును నిలబెట్టుకోవడానికి అవసరమైన మొత్తం రూ.17,500ను జూన్ 24లోగా డిపాజిట్ చేయాల్సి వుండగా, విద్యార్థి అతుల్ కుమార్ అందులో విఫలమయ్యాడు. సాధ్యమైనంతవరకు ఈ విషయంలో సాయం చేస్తామని హామీ ఇస్తూ, ఫీజు చెల్లించడానికి గడువు ముగిసే వరకు గత మూడు మాసాలుగా మీరేం చేస్తున్నారని ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ప్రశ్నించింది.

అతుల్ కుమార్ తరపు న్యాయవాది మాట్లాడుతూ చిట్టచివరి ప్రయత్నంలో కుమార్ జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్ష పాసై ఐఐటి ధన్‌బాద్‌లో సీటు తెచ్చుకున్నాడని, ఈ సమయంలో న్యాయస్థానం గనక సాయం చేయకపోతే కష్టమవుతుందని చెప్పారు. స్వల్పంగా వాదోపవాదాలు సాగిన తర్వాత ఐఐటి అడ్మిషన్లు చూసే ఐఐటి మద్రాసు జాయింట్ సీట్ అలోకేషన్ అథారిటీకి బెంచ్ నోటీసులు జారీ చేసింది. ఈ సందర్భంగా న్యాయవాది తన క్లయింట్ కుటుంబ ఆర్థిక పరిస్థితి గురించి తెలియచేశారు. సీటు కేటాయించిన తర్వాత నాలుగు రోజుల్లో అంత పెద్ద మొత్తం కట్టలేని పరిస్థితి వారిదని, దినసరి కూలీ కుటుంబం వారిదని తెలిపారు. ఆ విద్యార్థికి సాయం చేయలేమని జాతీయ ఎస్‌టి కమిషన్ కూడా చేతులెత్తేసింది. దీంతో వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.



మంగళవారం లండన్‌లోని మార్క్స్ మెమోరియల్ లైబ్రరీలో కామ్రేడ్ సీతారాం ఏచూరి సంస్మరణ సభలో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నేత మయూఖ్ బిశ్వాస్.

# సిబిఐ కేసులో కోర్టు ముందుకు కవిత

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

ఢిల్లీ లిక్కర్ కేసులో సిబిఐ దాఖలు చేసిన సప్లిమెంటరీ ఛార్జ్‌షీట్‌పై విచారణను రౌస్ అవెన్యూ కోర్టు మరోసారి వాయిదా వేసింది. సిబిఐ చార్జ్‌షీట్ లోని కొన్ని పేజీలను తెలుగు నుంచి ఇంగ్లీష్‌లోకి అనువదించి ఇవ్వాలని సిబిఐ అధికారులను గతంలో కోర్టు ఆదేశించింది. అయితే తిరిగి అవే కాపీలను దర్యాప్తు సంస్థ నిందితులకు పంపడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ.. తదుపరి విచారణను అక్టోబరు 4కు వాయిదా వేస్తున్నట్లు ట్రయల్ కోర్టు వెల్లడించింది. కల్వకుంట్ల కవితతో పాటు, ఈ కేసులోని సుమారు 40 మంది సహ నిందితులు వర్చువల్ మోడ్‌లో కోర్టు ముందు హాజరయ్యారు.

# శ్రీలంక పార్లమెంట్ రద్దు

- నవంబరు 21న కొత్త పార్లమెంట్ సమావేశం

**కొలంబో** మధ్యంతర ఎన్నికలు జరిపేందుకు వీలుగా శ్రీలంక పార్లమెంట్‌ను నూతన అధ్యక్షుడు అనుర దిసనాయకె రద్దు చేశారు. మంగళవారం అర్ధరాత్రి నుంచే ఇది అమలులోకి వచ్చింది. పార్లమెంటుకు ఎన్నికలు నిర్వహించి నవంబరు 21 కల్లా కొత్త పార్లమెంట్ సమావేశమవుతుందని ఆయన ప్రకటించారు. నవంబరు 14న పార్లమెంట్ ఎన్నికలు జరగనున్నాయి. షెడ్యూల్ కన్నా దాదాపు ఏడాది ముందుగా ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ బుధవారం నాడు వెలువడింది. ప్రజలు కోరుకున్న విధంగా లేనపుడు ఆ పార్లమెంట్‌ను కొనసాగించడంలో అర్థం లేదని అధ్యక్షుడు వ్యాఖ్యానించారు. 2020 ఆగస్టులో గత పార్లమెంట్ ఎన్నికలు జరిగాయి. రాజ్యాంగంలోని 70వ అధికరణ కింద తనకు సంక్రమించిన అధికారాలను ఉపయోగించి అధ్యక్షుడు ఈ చర్య తీసుకున్నారు.

పార్లమెంటు ఎన్నికల్లో నామినేషన్ దాఖలు కార్యక్రమం అక్టోబరు 4న ప్రారంభమై 11 వరకు కొనసాగుతుంది.

# నకిలీ ఓట్ల వ్యవహారంలో నలుగురి సస్పెన్షన్

**ప్రజాశక్తి -తిరుపతి సిటీ**

తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల సందర్భంగా వెలుగు చూసిన నకిలీ ఓట్ల వ్యవహారంపై నలుగురు పోలీసులను సస్పెండ్ చేస్తూ అనంతపురం రేంజ్ డిఐజి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సిఐలు అబ్బన్న, దేవేంద్ర కుమార్, ఎస్ఐలు సుమతి, నాగేంద్రబాబులను సస్పెండ్ చేశారు. తిరుపతి మాజీ ఎంపి బల్లి దుర్గాప్రసాద్ ఆకస్మిక మృతి కారణంగా తిరుపతి పార్లమెంటు స్థానానికి నిర్వహించిన ఉప ఎన్నికల సందర్భంగా నకిలీ ఓట్లు నమోదయ్యాయని ఆరోపణలు వచ్చిన విషయం విదితమే. ఈ ఘటనకు సంబంధించి అప్పటి తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ ఐఎఎస్ అధికారి గిరీష లాగిన్ నుంచి నకిలీ ఓట్లు నమోదు కావడంతో ఆయనపై సస్పెన్షన్ వేటు వేశారు. నకిలీ ఓట్ల కేసు నమోదులో అలసత్వం వహించారని భావించిన ఉన్నతాధికారులు ఇప్పటికే నలుగురు సిఐలను, ఎస్ఐలను సస్పెండ్ చేశారు. తాజాగా మరో ఇద్దరు సిఐలు, ఎస్ఐలను సస్పెండ్ చేశారు.

# చెక్కుచెదరని బంధం

- పాలస్తీనా రాయబారిని ఫ్రెండ్‌షిప్ మెడల్‌తో సత్కరించిన క్యూబా



**హవానా:** క్యూబా, పాలస్తీనా మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం గావించడంలో విశేష కృషి చేసిన పాలస్తీనా రాయబారి అక్రమ్ మహ్మద్ సమాన్‌ను ఫ్రెండ్‌షిప్ మెడల్‌తో క్యూబా విదేశాంగ శాఖ ఉప మంత్రి జోసెఫినా విడాల్ ఫెరీలో సత్కరించారు. సోదర దేశ రాయబారి పదవీ కాలం త్వరలో ముగియనున్న సందర్భంగా క్యూబా అధ్యక్షుని తరపున ఆయనకు ఈ మెడల్‌ను ఫెరీరో ప్రదానం చేశారు. పాలస్తీనా సమస్యకు పరిష్కారం కుదిరేంతవరకు ఆ దేశానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఫెరీలో పునరుద్ఘాటించారు. ఐరాస జనరల్ అసెంబ్లీ వార్షిక సమావేశాల సందర్భంగా అలీన దేశాల విదేశాంగ మంత్రుల సమావేశం న్యూయార్క్‌లో జరిగింది. ఈ సమావేశంలో క్యూబా విదేశాంగ మంత్రి, పొలిట్‌బ్యూరో సభ్యులు బ్రూనో రొడ్రిగజ్ పెరీరా మాట్లాడుతూ, పాలస్తీనాను ఐరాసలో పూర్తి స్థాయి సభ్యురాలిగా ముందస్తుగా చేర్చుకోవడాన్ని స్వాగతించారు. . పాలస్తీనాలో ఇజ్రాయిల్ మారణ హోమాన్ని అంతమొందించేందుకు నిజాయితీతో జరిగే చట్టబద్ధమైన అంతర్జాతీయ యత్నాలకు తాము సహకరిస్తామన్నారు. గాజాపైన, లెబనాన్‌పైన పెద్దయెత్తున బాంబు దాడులకు తెగబడుతున్న ఇజ్రాయిల్ గత పన్నెండు మాసాల్లో 40వేల మంది ప్రాణాలు తోడేసింది. పెద్దయెత్తున ఇళ్లు, ఆస్పత్రులు, ఇతర పౌర సదుపాయాలు ధ్వంసమయ్యాయి. గాజాలో 19 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. పాలస్తీనా ప్రజలకు మానవతా సాయం అందకుండా అడ్డుపడుతున్న ఇజ్రాయిల్ చర్యలను ఆయన ఖండించారు. ఇజ్రాయిల్- పాలస్తీనా సంఘర్షణకు రెండు దేశాల ఏర్పాటే సరైన పరిష్కారమని, ఆ దిశగా దీనికి పరిష్కారం చూపేందుకు అలీనోద్యమం ఒత్తిడి పెంచాలని ఆయన కోరారు.

1967కుమందున్న సరిహద్దుల ఆధారంగా స్వతంత్ర పాలస్తీనా ఏర్పడాలని ఆయన డిమాండ్ చేశారు. ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా అంతర్జాతీయ న్యాయ స్థానం (ఐసిజె)లో సౌతాఫ్రికా వేసిన పిటిషన్‌కు మద్దతుగా ఇంప్లీడ్ అవుతున్న దేశాల్లో క్యూబా మూడవది.

# పార్లమెంటు స్ట్రీట్ వద్ద ధర్నా

(మొదటి పేజీ తరువాయి)

పందిని తొలగించాలి.

- ఎలిఫెంట్ కారిడార్లు, టైగర్ రిజర్వ్‌లు, వన్యప్రాణుల అభయారణ్యాల పేరుతో ఏకపక్ష, బలవంతపు తొలగింపులను ఆపాలి.
- అటవీ హక్కులు, కమ్యూనిటీ అటవీ హక్కులను నిర్ధారించాలి. ఎఫ్‌ఆర్ఎ, పిఇఎస్ఎ ఉల్లంఘనను ఆపాలి. అటవీ ప్రాంత ప్రజలకు విద్యుత్తు అందేలా చూడాలి.
- పశువుల వ్యాపారంపై ఆంక్షలు ఎత్తివేయాలి. ఉత్పత్తి లేని పశువులను మార్కెట్ ధరలకు కొనుగోలు చేయాలి. ఆవు విజిలెంట్ గ్రూపులపై బలమైన నిరోధక చర్యలను నిర్ధారించాలి.
- వన్యప్రాణుల వల్ల మరణించిన వ్యక్తుల కుటుంబాలకు రూ.1 కోటి పరిహారం, ప్రభుత్వ ఉద్యోగం, అలాగే తీవ్ర గాయాలపాలైన వారికి రూ.50 లక్షలు పరిహారం ఇవ్వాలి.
- పంచాయతీలు, గ్రామసభల ద్వారా పంట నష్టాలను సరైన అంచనా వేయాలి. తగిన పరిహారం అందించాలి.
- కృత్రిమ వాణిజ్య కలప చెట్లను, ఆక్రమణ జాతులను దశలవారీ క్లియర్ చేయాలి. అటవీ ప్రాంతాల్లో పండ్ల చెట్లను, వెదురును ప్రోత్సహించాలి.
- హాట్ బెడ్‌లలో కందకాలు, వైర్-మెష్, ఎలక్ట్రిక్ ఫెన్సింగ్, ముందస్తు హెచ్చరిక వ్యవస్థను నిర్మించాలి.
- ఉపాధి కింద సాయంత్రం నుండి తెల్లవారుజాము వరకు కమ్యూనిటీ వాచ్‌ను రోజుకు రూ.1,000 ఏర్పాటు చేయాలి.

# మత వైషమ్యాలు రెచ్చగొట్టొద్దు

(మొదటి పేజీ తరువాయి)

పోరు పిట్ట పోరు పిల్లి తీర్చినట్లుగా అవుతుందన్నారు. కేంద్ర ఆరోగ్యశాఖ ఆస్పత్రుల్లో వైద్యం ఖర్చులు పెరిగి ప్రజలపై భారాలు పడుతుంటే పట్టించుకోవడం లేదని, లడ్డూ విషయంలో మాత్రం నేరుగా రంగంలోకి దిగి తామే విచారణ చేస్తామని ప్రకటించిందన్నారు. కేంద్ర మంత్రిత్వశాఖలు విచారణ మేము చేస్తామంటే మేము చేస్తామంటూ పోటీలు పడి రంగంలోకి దిగుతున్నాయని, ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని రాష్ట్రంలో రాజకీయంగా బలపడాలని బిజెపి ప్రయత్నిస్తుంటే దానికి టిడిపి, జనసేన, వైసిపి తీసుకుంటున్న వైఖరులు తోడ్పడుతున్నాయని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, ఆయా పార్టీలు రాష్ట్రంలో లౌకిక రాజ్యాంగాన్ని రక్షించేలా, మత సామరస్యాన్ని కాపాడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఫెడరల్ వ్యవస్థ మన దేశానికి ఆయువు పట్టని, అన్నింటిపైనా కేంద్రానికి పెత్తనం వదిలిపెట్టడమంటే ఫెడరల్ వ్యవస్థకు గొడ్డలిపెట్టని అన్నారు. ఫెడరల్ వ్యవస్థ దెబ్బతింటే ఏ ప్రాంతీయ పార్టీకీ మనుగడ ఉండదని అన్నారు. మత వైషమ్యాలకు ఆస్కారం ఇవ్వకుండా వెంటనే తిరుమల తిరుపతి లడ్డూ వ్యవహారాన్ని సమగ్ర రీతిలో విచారణ చేయాలని కోరారు. సిట్ విచారణ పూర్తయి నివేదిక వచ్చేంతవరకు అన్ని పార్టీలూ సంయమనం పాటించి విచారణకు తోడ్పడాలని కోరారు. ఉద్రిక్తతలు పెంచేలా మాట్లాడటం తగదని హెచ్చరించారు.






**మీకోసం**

పిల్లలకు కాల్షియం సంవృద్ధిగా అందాలంటే ప్రతిరోజూ ఉదయం అర చెంచా, సాయంత్రం అర చెంచా నువ్వులను నమిలి తినేలా అలవాటు చేయాలి. నువ్వుండలు తిన్నా మంచిదే.

**జీవన సౌరభం**

ఏ సమస్యనైనా ఎదుర్కొనే మానసిక సామర్థ్యం అలవర్చుకోవాలి. అప్పుడు సమస్యలన్నీ చిన్నవిగా కనిపిస్తాయి.

JEEVANA జీవన the family

## కాకి గోల



కాకి, వాడలోని ఓ కొబ్బరి చెట్టు మీద గూడు కట్టుకొని గుడ్లు పెట్టింది. ఆ కాకి మేతకెళ్ళినప్పుడు ఓ కోయిల ఆ గూటిలో గుడ్డు పెట్టి చక్కా రివ్వున ఎగిరిపోయింది. కాకి సాయంత్రం వచ్చి గుడ్లను చూ సుకుంది, సర్దుకొందీ. 'నా గుడ్లను ఎవరూ తీసుకోలేదు, అని సంతోషపడుతూ, నా అనుమానం కానీ లోకంలో జనాలు 'కాకి లెక్క', 'కాకి లెక్క' అంటారు ఎందుకో నాకు అసలు అర్థం కాదు. నేను ఎన్ని సార్లు గుడ్లను లెక్కపెట్టినా ఓ గుడ్డు ఎక్కువే అనిపిస్తుంది. కానీ తక్కువ మాత్రం రావడం లేదు! నాకు ఒక కన్ను, ఓవైపే కనిపిస్తుంది కాబట్టే అలా అనిపిస్తుందేమో' అని తనలో తను అనుకుంది.

కొన్నాళ్లకు కాకి, గుడ్లను చక్కగా పేల్చి, పిల్లలను తయారుచేసింది. అయితే కొన్నాళ్లకు ఆ పిల్లల్లోనీ కోయిల పిల్ల చిన్నగా 'కుహు కుహు...' అని పాడ సాగింది. ఆ కోయిల పిల్లను చూసి కాకి పిల్లలు ఎంత ప్రయత్నించినా గోలగానే అనిపిస్తుంది కానీ ఆ రాగం రావడం లేనే లేదు. ఆ రోజు కాకి గూటికి వచ్చేసరికి, పిల్లలు 'కావు కావుమ'ని గట్టిగా ఏడ్చాయి.

అప్పుడు కాకి తన పిల్లలను బుజ్జగిస్తూ 'ఎందుకు ఏడుస్తారు? అది కోయిల పిల్ల అందుకే పాడగల్గుతుంది. లోకంలో అందరూ ఒకేలా ఉండరు. కోయిలలు పాడగలవు, నెమలులు నాట్యం చేయ గలవు. ఒక్కో పక్షికి ఒక్కో ప్రత్యేక లక్షణం ఉంటుంది' అని పిల్లలను సముదాయించింది. మనుషులు తమ పిల్లలు గోల చేస్తే 'కాకి గోల' అంటారు కానీ కోయిల గోల అనరూ, నెమలి గోల అనరు. ఇది మన ప్రత్యేకత' అని కూడా చెప్పింది. అంతే ఆ కాకిపిల్లలు ఒక్కసారిగా 'అయితే 'మనమే గొప్ప' అని ఏడుపు ఆపి, మరి గట్టిగా 'కావ్ కావ్' అని అరిచాయి.

-అమ్మిన వెంకట అమ్మిరాజు,
పేరూరు, వాజేడు (మం),
ములుగు (జిల్లా),
94407 08656.

### పదాలు కనిపెట్టండి

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| B | Q | D | A | S | W | L | O | O | M | P |
| A | I | S | P | R | I | N | G | H | S | U |
| P | C | R | W | A | B | Y | A | P | H | D |
| R | F | Z | X | I | G | S | H | O | O | D |
| I | V | D | U | N | N | U | I | Z | W | L |
| L | I | R | A | I | S | O | Q | S | E | E |
| R | A | B | I | R | D | S | A | B | R | S |
| B | L | O | O | M | Q | L | I | H | S | Z |
| S | P | F | L | O | W | E | R | D | D | L |



April, Spring, Rain, Showers, Birds, Bloom, Puddles, Flower

పిల్లలూ, ఇక్కడున్న బాక్సులోని ఆంగ్ల అక్షరాల్లో కింద ఇచ్చిన పదాలన్నీ ఉన్నాయి. అవి ఎక్కడెక్కడ ఉన్నాయో కనిపెట్టండి.

### నేను గీసిన బొమ్మ





యాడారం నితీష్ గౌడ్,
8వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రాంపూర్,
నిజాంపేట మండలం, మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

# 'ఆ' సమస్యపై బహిరంగ చర్చ అవసరం..

కొన్ని విషయాలు చాలా చిన్నవిగా కనిపిస్తాయి. కానీ ఆరోగ్యపరంగా వాటి పరిణామాలు మాత్రం చాలా తీవ్రంగా ఉంటాయి. ముఖ్యంగా మహిళల విషయంలో ఇవి చాలా ప్రభావం చూపిస్తుంటాయి. అలా పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు అంతంతమాత్రమే ఉన్నచోట వారు పడే ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ఇటీవల రైల్వే బోర్డుకు మహిళా లోకో పైలట్లు రాసిన లేఖలో ఇది స్పష్టమైంది. 'పేలవమైన పని పరిస్థితులు తమ ఆరోగ్యానికి హాని కలిగించాయని, సరైన మరుగుదొడ్లు లేక యుటిఐ, గర్భస్రావాలకు కూడా కారణమయ్యాయ'ని ఆ ఉద్యోగినులు ఆవేదనతో రాసిన లేఖ చర్చకు దారితీసే అంశం. తాము ఎదుర్కొంటున్న సమస్యలు, వారికి ఎదురైన అనుభవాలు వారి మాటల్లోనే తెలుసుకుందాం.



మీనా (పేరు మార్చబడింది) మధ్యప్రదేశ్ వాసి. అసిస్టెంట్ లోకోపైలట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తోంది. 2021 మే నెలలో విధుల్లో ఉండగానే ఆమెకు పొట్టకింద భాగంలో విపరీతమైన నొప్పి వచ్చింది. మొదట్లో అది మామూలు గ్యాస్ నొప్పని ఆమె అశ్రద్ధ చేసింది. అంతకుముందు చాలాసార్లు తను ఆ నొప్పిని భరించింది. కానీ ఈసారి అలా లేదు. దీంతో డాక్టరుని కలిసింది. అక్కడ ఆమెకి ఓ చేదు నిజం తెలిసింది. 'డాక్టర్లు మొదట నాకు పెయిన్‌కిల్లర్‌లు ఇచ్చారు. అయితే సోనోగ్రఫీ చేయించుకోమని సూచించారు. నేను మొదట ఇది గ్యాస్ నొప్పని భావించాను. ఒకవేళ అదీ కాకపోతే యూరిన్ ఇన్‌ఫెక్షన్ ఉంటుందని అనుకున్నాను. కానీ ఆ రెండు జరగలేదు. సోనోగ్రఫీ పరీక్షలో నా కిడ్నీ పక్కన పెద్ద చీముగడ్డ తయారైందని తేలింద'ని ఆమె చెప్పింది. వెంటనే దానికి చికిత్స తీసుకోకపోతే, ఆ గడ్డ పగిలి, అంతర్గత అవయవాలు దెబ్బతింటాయని డాక్టర్లు మీనాకి చెప్పారు. సిక్ లీవ్ తీసుకుని ఆపరేషన్ చేయించుకుంది. సకాలంలో తెలుసుకోవడం వల్ల పెద్ద ప్రమాదం నుండి బయటపడ్డావని డాక్టరు అన్నారు. యూరినరీ ట్రాక్ ఇన్‌ఫెక్షన్ వల్లే గడ్డ ఏర్పడినట్లు తెలుసుకున్న మీనా పని ప్రదేశంలో తను, తనలాంటి వారు పడే ఎన్నో ఇబ్బందులపై మాట్లాడారు.

**నీళ్లు తక్కువ తాగేవాళ్లం**

గూడ్సు ట్రైన్ లోకో పైలట్‌గా మీనా సుదీర్ఘ పనిగంటలు పనిచేస్తున్నారు. 'బ్రేక్ లేకుండా 12 గంటలు పనిచేయాలి. ఈ సమయంలో మా సిబ్బందిలో ఎవరమూ వాష్‌రూమ్ ఉపయోగించుకునేవాళ్లం కాదు. యూరిన్ రాకుండా ఉండేందుకు నీళ్లు తక్కువ తాగేవాళ్లం. ఒకవేళ వెళ్లాల్సివచ్చినా, బలవంతంగా ఆపుకునేవాళ్లం. ఇలా చాలా సార్లు జరిగింది. ఇలా చేయడం వల్లే నేను ఇంత అనారోగ్యానికి గురయ్యాను. అయితే ఈ సమస్య నా ఒక్కదానిదే కాదు' అంటున్నారు ఆమె.

**ప్లాట్‌ఫామ్, రన్నింగ్‌రూమ్‌లోనే..**

ఉత్తరప్రదేశ్‌కి చెందిన సమీరా తాను ఎదుర్కొన్న సమస్యల గురించి ఇలా చెబుతోంది.



'సాధారణంగా చాలా ట్రైన్లలో వాష్‌రూమ్ క్యాబిన్లు ఉండవు. ఒకవేళ ఉన్నా వాటిల్లో ఎక్కువ గంటలు నీటి సౌకర్యం ఉండదు. స్టేషన్లో కూడా మాకోసం స్పెషల్ వాష్‌రూమ్‌లు లేవు. అర్జంటుగా వెళ్లాల్సివచ్చినప్పుడు మేము స్టేషను ప్లాట్‌ఫామ్ లేదా రన్నింగ్ రూమ్ వరకు వెళతాం. అక్కడికి చేరుకోవడానికి సుమారు 5 నిమిషాలు పడుతుంది' అని అంటోంది.



30 ఏళ్ల సమీర వివాహిత. పిల్లలను కనాలని ప్లాన్ చేసుకుంటోంది. ఈ సమయంలోనే ఆమె మొదటిసారి గర్భం దాల్చింది. పుట్టబోయే పండంటి బిడ్డ కోసం ఎన్నో కలలు కంది. అయితే విపరీత పనిగంటలు, ఒత్తిడి వల్ల మూడు నెలలకే ఆమె తన బిడ్డను కోల్పోయింది. ఇది ఒకటి, రెండు సార్లు కాదు. వరుసగా నాలుగైదు సార్లు జరిగింది. ఈ బాధ ఆమెని మానసికంగా కుంగదీసింది. ఇప్పుడు ఆరోసారి గర్భందాల్చినా ఆమె తీవ్ర భయందోళనల మధ్యే విధులకు హాజరవుతోంది.

**ప్రత్యేక సదుపాయాలు లేవు**

లోకోపైలట్ జూహీ కూడా తన అనుభవాన్ని ఇలా చెబుతోంది.. 'పని ప్రదేశంలో మరుగుదొడ్ల సమస్య ప్రతి మహిళా ఎదుర్కొనే సాధారణ సమస్య. ఒక్క మరుగుదొడ్లే కాదు, ఏ పని చేయాలన్నా వారి శక్తికి మించి పనిచేయాల్సి వస్తుంది. మాల్స్, హోటల్స్, హాస్పిటల్స్, బట్టల దుకాణాలు వంటి తదితర సంస్థల్లో పనిచేసే మహిళల కోసం అక్కడ ప్రత్యేక సదుపాయాలంటూ ఏమీ ఉండవు. మా క్యాబిన్ నుండి కిందకి దిగడానికి మేము నిచ్చెనలు ఉపయోగించాల్సి వస్తుంది. అవి నేల నుండి చాలా ఎత్తుకి బిగించబడి ఉంటాయి. దీంతో మేము 3 నుండి 4 అడుగుల దూరం కిందికి, పైకి దుమకాల్సి వస్తుంది. ఒక్కోసారి గూడ్సు ట్రైను ప్లాట్‌ఫారమ్ దగ్గర ఆగదు. అప్పుడు మా బాధ మరింత పెరుగుతుంది' అని చెప్పిన జూహీ, గతేడాది తన క్యాబిన్ నుండి కిందికి దిగుతూ కాలు జారి పడిపోయింది. భుజాలకి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స తీసుకుని విధుల్లో చేరినా లోకోపైలట్‌గా పనిచేసే శక్తి లేక ఆఫీసుపని చేస్తానని అభ్యర్థించింది. అయితే చాలా తక్కువ కాలంలోనే తిరిగి విధుల్లోకి చేరమని ఆమెపై ఒత్తిడి ఎక్కువైంది. ఈ పరిస్థితినే ఆమె తన మాటల్లో ఇలా చెబుతోంది.

'చాలా మంది మహిళలు తమ కాళ్ల మీద తాము నిలబడాలని కోరుకుంటారు. కానీ పని చేసే చోట సరైన మౌలిక సదుపాయాలు లేక నానా యాతనలు పడతారు. మహిళలు పనిచేసే ప్రతి రంగంలోనూ ఆమెకంటూ ప్రత్యేక వసతులు కల్పించడం కనీస బాధ్యత' అని జూహీ తన ఆవేదనను వ్యక్తపరిచారు.

ఇండియన్ రైల్వేస్‌లో మహిళా లోకోపైలట్లు 2000 మందికి పైగా ఉన్నారు. వీరిలో అనారోగ్యంతో చికిత్స తీసుకుంటున్న వారిలో అత్యధికులు యూరినరీ ఇన్‌ఫెక్షన్ల సమస్యతో బాధపడుతున్నవారేనని ఓ ప్రముఖ మీడియా సంస్థ చేసిన సర్వేలో తేలింది. అపరిశుభ్ర వాతావరణం వల్ల యూరిన్ ఇన్‌ఫెక్షన్, యుటైరస్ ఫైబ్రాయిడ్స్, అధిక రక్తపోటు, గర్భస్రావాలు తరచూ ఈ లోకోపైలట్లు ఎదుర్కొంటున్నట్లు కూడా నివేదికలో స్పష్టమైంది.

మీనా, సమీర, జూహీ.. మాత్రమే పని ప్రదేశంలో సమస్యలు ఎదుర్కొనడం లేదు. ఏ రంగమైనా, ఏ స్థాయి ఉద్యోగమైనా ప్రతి మహిళా కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. కానీ ఎక్కడో కొన్ని చోట్ల మాత్రమే ఆ సమస్యలు వెలుగులోకి వస్తాయి. సమస్యలపై స్పందించడంలో ఈ మహిళలు ఒకడుగు ముందుకు వేశారు. వీరు వేసిన బాట ఎంతోమందికి ఆదర్శం.

# పని గంటలు పెంచితే ప్రమాదమే

- పనితీరు మందగిస్తుంది
- ఉద్యోగుల ఆరోగ్యం పైనా ప్రభావం
- పని-జీవితం మధ్య సమతూకం అవసరం
- పరిశోధకుల మనోగతం




**న్యూఢిల్లీ :** దేశ పురోభివృద్ధి కోసం యువత వారంలో 70 గంటల పాటు పనిచేయాలని గత సంవత్సరం ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి సలహా ఇచ్చారు. అమెరికాలో టెస్లా వ్యవస్థాపకుడు ఎలన్ మస్క్ ఓ అడుగు ముందుకు వేసి విజయాన్ని అందుకోవాలంటే వారానికి వంద పని గంటలు ఉండాలని సూచించా రు. అయితే దీర్ఘకాల పని గంటలు సత్ఫలితాలను ఇవ్వకపోగా ప్రతికూల పరిణామాలకు దారితీస్తాయి. ఉద్యోగుల సామర్థ్యం దీర్ఘకాలం కొనసాగాలంటే ఆరోగ్యకరమైన పని-జీవితం సమతూకంగా ఉండాలని పరిశోధనలు చెబుతున్నాయి. పని ప్రదే శంలో ఎక్కువ గంటలు గడపడం ఉద్యోగుల ఆరో గ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీనిపై దేశ వ్యాప్తంగా చర్చ నడుస్తోంది కూడా. 26 సంవత్స రాల అన్నా సెబస్టియన్ పెరయిల్ అనే అకౌంటెంట్ మరణం ఉద్యోగుల పని ఒత్తిడికి, మానసిక ఆందోళ నకు అద్దం పడుతోంది. ఆమె నాలుగు నెలల క్రితమే ఓ సంస్థలో ఉద్యోగంలో చేరారు. ఆ సంస్థ ఇండియా విభాగం చైర్మెన్‌కు పెరయిల్ తల్లి ఓ లేఖ రాస్తూ తన కుమార్తెకు పనిభారం అధికమైందని, తనకు విధించిన లక్ష్యాన్ని చేరుకోవడానికి నిద్ర, ఆహారం కూడా మానేసిందని ఆరోపించారు.

**మనుగడ కోసం...**

పనిని, జీవితాన్ని సమతూకం చేసుకునే ఉద్యోగులు విధి నిర్వహణలో పెద్దగా ఇబ్బందులు పడరు. ఎంత పని ఒత్తిడి ఉన్నప్పటికీ సమర్థతతో ముందుకు సాగుతారు. పని, జీవితం...వీటిని బ్యాలెన్స్ చేసుకుంటే జీవన నాణ్యత మెరుగుపడుతుంది. అటు ఉద్యోగంలోనూ మంచి పనితీరు కనపడుతుంది. వాస్తవానికి మన దేశంలో చాలా మంది ఉద్యోగులు నారాయణ మూర్తి చెబుతున్న 'వారానికి 70 గంటల' కంటే ఎక్కువ సమయమే పనిచేస్తున్నారు. అయినప్పటికీ మనుగడ కోసం పోరాటాన్ని కొన సాగించాల్సి వస్తోంది. ఉదాహరణకు ఆశా వర్కర్లు రోజుకు 10-14 గంటలు పని చేస్తున్నారు. ఇంత కష్టపడినా వారికి నెలకు వచ్చే జీతం మూడు వేల రూపాయలు మాత్రమే. గిగ్ వర్కర్లు కూడా రోజుకు ఎనిమిది గంటల కంటే ఎక్కువగా కష్టపడాల్సి వస్తోంది. ఇదంతా తమ పోషణకోసమేనని వేరే చెప్పాల్సిన అవసరం లేదు.

**ఫలితాలపై పనిగంటల ప్రభావం**

2022లో అంతర్జాతీయ కార్మిక సంఘం ఇచ్చిన నివేదిక ప్రకారం దక్షిణాసియాలో గరిష్టంగా వారానికి సగటు పని గంటలు 49. 48.8 పని గంటలతో తూర్పు ఆసియా రెండో స్థానంలో ఉంది. దేశం ముందడుగు వేయాలంటే ఉద్యోగులు వారానికి 70 గంటలు పనిచేయాలంటూ నారాయణ మూర్తి పిలుపునివ్వడం దేశభక్తిని వక్రీకరించడం, అంకితభావాన్ని నెంబర్ గేమ్‌గా కుదించడమే అవుతుంది. కార్మికులు తక్కువ గంటలు పనిచేసినప్పుడే ఉత్పాదకత పెరుగుతుందని బిజినెస్ స్కాలర్ జెఫ్రీ ఫెఫర్ అభిప్రాయపడ్డారు. వారానికి సగటున 48 గంటల కంటే ఎక్కువ పనిచేస్తే ఉత్పాదకత తగ్గిపోతుం దని ఎమ్మా లక్స్టన్ అనే పరిశోధకురాలు తేల్చారు. పని గంటలు పెరిగితే పనితీరు మందగిస్తుందని గతంలో అంతర్జాతీయ కార్మిక సంఘం కూడా తెలిపింది. చేసే పనిలో స్వతంత్ర ప్రతిపత్తి ఉంటే ఆరోగ్యంతో పాటు ఉద్యోగి పనితీరు కూడా మెరుగుపడుతుందని పరిశోధకులు అంటున్నారు.

**ఐస్‌లాండ్ అనుభవాలతో...**

పని గంటల విషయంలో ఉద్యోగులకు వెసులుబాటు ఉండాలని, అప్పుడే వారు తమ వ్యక్తిగత, వృత్తిపరమైన బాధ్యతలను మరింత ఎక్కువగా నెరవేరుస్తారని పరిశోధకుల అభిప్రాయం. దీనివల్ల పని ఒత్తిడి కూడా తగ్గుతుంది. మానసిక ప్రశాంతత చేకూరుతుంది. ఉద్యోగులతో ఎక్కువ గంటలు పని చేయించుకుంటే వారితో నిరాసక్తత కలుగుతుంది. ఒత్తిడికి గురవుతారు. ఉత్పత్తి కూడా పడిపోతుంది. తక్కువ పని గంటలు సమర్థతను పెంచుతాయని కొన్ని పరిశోధనలు చెబుతున్నాయి. ఉదాహరణకు ఐస్‌లాండ్‌లో 2015-2019 మధ్యకాలంలో 2,500 మందికి వారానికి నాలుగు పనిదినాల పద్ధతిని ప్రయోగాత్మకంగా అమలు చేశారు. ఈ కాలంలో వారి ఉత్పాదకత పెరిగిందని తేలింది. వారి ఆరోగ్యం కూడా మెరుగైంది. పని-జీవితం మధ్య సమతూకం ఏర్పడింది. ఐస్‌లాండ్ అనుభవాల నేపథ్యంలో బెల్జియం, జర్మనీ, పోర్చుగల్ కూడా అలాంటి ప్రయోగాలే చేశాయి. అవి కూడా మంచి ఫలితాలనే అందించాయి. పని గంటలు కుదించడం, విశ్రాంతి సమయాన్ని తప్పనిసరి చేయడంపై ప్రపంచవ్యాప్తంగా విస్తృత స్థాయిలో చర్చ జరుగుతోంది. పని గంటలను తగ్గించిన బెల్జి యం, జర్మనీ దేశాలలో సత్ఫలితాలు కన్పిస్తున్నాయి.

# కాన్పూర్ టెస్ట్‌కు టీమిండియా సిద్ధం

- రేపటినుంచి బంగ్లాదేశ్‌తో రెండో, చివరి టెస్ట్




**కాన్పూర్:** బంగ్లాదేశ్ జరిగిన తొలి టెస్ట్‌లో ఘన విజయం సాధించిన టీమిండియా.. ఇక క్లీన్‌స్వీప్‌పై గురిపెట్టింది. కొత్త ప్రయోగాలకు తెరలేపకుండా తొలి టెస్ట్‌లో ఆడిన జట్టుతోనే రెండోటెస్ట్ బరిలోకి దిగాలని యోచిస్తోంది. బంగ్లాతో తొలిటెస్ట్‌లో తొలి ఇన్నింగ్స్‌లో ఓపెనర్లు జైస్వాల్, శుభ్‌మన్‌కి తోడు, అశ్విన్, వికెట్ కీపర్ రిషబ్ పంత్ అద్భుత బ్యాటింగ్‌తో అలరించారు. చెన్నై టెస్టులో రవిచంద్రన్ అశ్విన్ సెంచరీతో పాటు మ్యాచ్ విన్నింగ్ ఆరు వికెట్లు తీసి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. కాన్పూర్‌లోని గ్రీన్ పార్క్ స్టేడియంలో సెప్టెంబరు 27న ప్రారంభమయ్యే రెండో టెస్టులో అశ్విన్ మరో రికార్డులకు అడుగు దూరంలో ఉన్నాడు. ఐసిసి ప్రకటించిన తాజా టెస్టు బౌలర్ల ర్యాంకింగ్స్‌లో అశ్విన్ అగ్రస్థానంలో ఉండగా.. ఆల్‌రౌండర్ల జాబితాలో జడేజా తర్వాత రెండో స్థానంలో ఉన్నాడు. బంగ్లాపై అశ్విన్ సెంచరీతో చెలరేగాడు. జడేజాతో కలిసి ఏడో వికెట్‌కు ఏకంగా 199 పరుగుల భాగస్వామ్యం నమోదు చేసి జట్టును ఆదుకున్నాడు. ఇక రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్లతో చెలరేగాడు.

**కెఎల్ రాహుల్ బెస్ట్ ఫీల్డర్: ఫీల్డింగ్ కోచ్**

టీమిండియా ఫీల్డర్లలో కెఎల్ రాహుల్ అద్భుతమని ఫీల్డింగ్ కోచ్ టి. దిలీప్ పేర్కొన్నాడు. భారత మిడిలార్డర్ బ్యాటర్ కేఎల్ రాహుల్‌ను మార్క్‌వాతో పోల్చుతూ ఆకాశానికి ఎత్తేశాడు. బంగ్లాదేశ్‌తో తొలి టెస్టులో ప్రమాదకరమైన బ్యాటర్ ముష్ఫికర్ రహీమ్ ఇచ్చిన క్యాచ్‌ను కేఎల్ అద్భుతంగా ఒడిసిపట్టాడు. కేఎల్ వద్ద అద్భుతమైన టెక్నిక్ ఉందని.. మార్క్‌వా కూడా గతంలో ఇలాంటి స్ట్రాటజీనే పాటించేవాడని దిలీప్ పేర్కొన్నాడు. స్లిప్‌లోనే కాకుండా.. మిడాన్ ఫీల్డింగ్‌లోనూ కేఎల్ రాహుల్ చురుగ్గా ఉంటాడు. క్యాచ్‌ల కోసం అతడు చూపించిన విధానం అద్భుతం. బంతి కింద పడకుండా తన వేళ్లను ఎలా ఉపయోగించాలనే దానిపై పూర్తి అవగాహన ఉండాలి. మైదానంలో సరైన సమయంలో ఆచరించాలి. కేఎల్ రాహుల్ ఎత్తుగా ఉండే ప్లేయర్. అలాంటి వ్యక్తి క్యాచ్‌ను అందుకోవడం తేలికైన విషయమేం కాదు" అని దిలీప్ వ్యాఖ్యానించాడు. తొలి ఇన్నింగ్స్‌లో బుమ్రా వేసిన 13వ ఓవర్‌లో ముష్ఫికర్ రహీమ్ (8) ఆడిన బంతిని రెండో స్లిప్‌లో ఉన్న కేఎల్ రెండు చేతులతో అందుకొన్నాడు. రెండో ఇన్నింగ్స్‌లోనూ ముష్ఫికర్ ఇచ్చిన క్యాచ్‌ను రాహుల్ మిడాన్‌లో ఒడిసిపట్టాడు. ఈసారి అశ్విన్ బౌలర్.

## టాప్-10లో పంత్‌కు చోటు

- ఐసిసి టెస్ట్ ర్యాంకింగ్స్ విడుదల

**దుబాయ్:** అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) ప్రకటించిన తాజా టెస్ట్ బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో యువ వికెట్ కీపర్ రిషబ్ పంత్ సత్తా చాటాడు. బంగ్లాదేశ్‌తో జరిగిన తొలిటెస్ట్‌లో సెంచరీతో కదం తొక్కడంతో తొలిసారి టాప్-10లో చోటు దక్కించుకున్నాడు. తాజా ఐసిసి టెస్టు ర్యాంకింగ్స్‌లో ఈ వికెట్ కీపర్ ఆరో స్థానానికి చేరుకున్నారు. అదే సమయంలో సీనియర్ ఆటగాళు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి ర్యాంకులు దిగజారాయి. ఇటీవల బంగ్లాదేశ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌తో టెస్టుల్లో రీ ఎంట్రీ ఇచ్చిన పంత్.. తనదైన బ్యాటింగ్‌తో అందరినీ అలరించాడు. రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీ సాధించాడు. ఈ క్రమంలో 731పాయింట్లతో టెస్టు ర్యాంకింగ్స్‌లో ఆరో స్థానానికి చేరాడు. అదే సమయంలో యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్ ఓ స్థానం మెరుగుపరుచుకొని 751 పాయింట్లతో టాప్-5కి ఎగబాకాడు. నెంబర్ వన్ స్థానంలో ఇంగ్లాండ్ ఆటగాడు జో రూట్, రెండోస్థానంలో న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్, 3వ స్థానంలో డారెల్ మిఛెల్, 4వ స్థానంలో ఆస్ట్రేలియా ఆటగాడు స్టీవ్ స్మిత్ ఉన్నారు. ఇక టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, సీనియర్ బ్యాటర్ విరాట్ కోహ్లి వరుసగా పది, 11వ స్థానాల్లో నిలిచారు. ఇక టెస్టు నెంబర్ వన్ బౌలర్‌గా రవిచంద్రన్ అశ్విన్ కొనసాగుతున్నాడు. జస్‌ప్రీత్ బుమ్రా రెండోస్థానంలో ఉన్నాడు. ఆస్ట్రేలియా బౌలర్ హేజిల్‌వుడ్ మూడు, పాట్ కమ్మిన్స్ 4వ స్థానంలో ఉన్నారు. టీమిండియా ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా ఒకస్థానం మెరుగుపరుచుకొని 6వ స్థానంలో నిలిచాడు. వన్డే ర్యాంకింగ్స్‌లో ఆఫ్ఘనిస్థాన్ ఓపెనర్ రహ్మానుల్లా గుర్బాజ్ అద్భుత ప్రదర్శనతో తొలిసారిగా టాప్-10లో చేరిన తొలి బ్యాటర్‌గా నిలిచాడు. ఇటీవల దక్షిణాఫ్రికాపై సెంచరీ చేశాడు. వన్డే ర్యాంకింగ్స్‌లో నెంబర్ వన్ బ్యాటర్‌గా పాక్ కెప్టెన్ బాబర్ అజామ్ నిలువగా.. రెండోస్థానంలో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ కొనసాగుతున్నాడు. శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి వరుసగా మూడు, నాలుగు ర్యాంకుల్లో కొనసాగుతున్నారు.

## శ్రీకాంత్ శుభారంభం

### మకావు ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ



**మకావు:** మకావు బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్ శుభారంభం చేశాడు. బుధవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో శ్రీకాంత్ 21-14, 21-15తో ఇజ్రాయేల్‌కు చెందిన డానియేల్‌ను చిత్తుచేశాడు. వరుససెట్లలో నెగ్గిన శ్రీకాంత్.. ప్రి క్వార్టర్స్‌లో భారత్‌కే చెందిన అస్మిత్ శెట్టితో తలపడనున్నాడు. ఇతర పోటీల్లో అస్మిత్ శెట్టి 21-13, 21-5తో భారత్‌కే చెందిన మిశ్రాను ఓడించగా.. సమీర్ వర్మ, మిథున్ మంజునాథ్, సుబ్రహ్మణ్యన్, చిరాగ్ శేన్ తొలిరౌండ్‌లో ఓటమిపాలయ్యారు. మంజునాథ్ 12-21, 15-21తో హాంగ్(చైనీస్ తైపీ), సుమిత్ వర్మ 21-18, 11-21, 13-21తో వాంగ్(చైనా) చేతిలో పోరాడి ఓడారు.

## బ్రూక్స్ సెంచరీ

### మూడో వన్డేలో ఆస్ట్రేలియాపై ఇంగ్లండ్ గెలుపు

**చెస్టర్ లీ స్ట్రీట్(ఇంగ్లండ్):** ఆస్ట్రేలియాతో జరిగిన మూడో వన్డేలో ఇంగ్లండ్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం 46పరుగుల తేడాతో విజయం సాధించింది. ఆస్ట్రేలియా నిర్దేశించిన 305పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో 37.4 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 254 పరుగుల వద్ద ఉండగా.. భారీ వర్షంతో మ్యాచ్ నిలిచి పోయింది. అప్పటికే డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం ఇంగ్లండ్ గెలుపు ఖాయమైంది. బ్రూక్స్(110నాటౌట్) విల్ జాక్స్(84), లివింగ్‌స్టోన్(33) బ్యాటింగ్‌లో రాణించారు.

## 16 మంది ఐపిఎస్‌లు బదిలీ

- అనకాపల్లి ఎస్‌పిగా తుహీన్ సిన్హా

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

16 మంది ఐపిఎస్ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సిఐడి ఐజిగా ఎస్‌ఐబి ఐజిగా వున్న వినీత్ బ్రిజ్‌లాల్‌ను, సెబ్ డైరెక్టరు ఎం రవిప్రకాశ్‌ను పిఅండ్‌ఎల్ ఐజిగా, పిఅండ్‌ఎల్ ఐజిగా వున్న రామకృష్ణను ఇంటెలిజెన్స్ ఐజిగా వేశారు. వెయిటింగ్‌లో వున్న అమ్మిరెడ్డిని డిజిపి కార్యాలయ అడ్మిన్‌గా వేశారు. రోడ్ సేఫ్టీ అథారిటీ డిఐజిగా సిహెచ్ విజయరావు, ఇంటెలిజెన్స్ ఎస్‌పిగా ఫకీరప్ప, శాంతిభద్రతల ఎఐజిగా సిద్ధార్థ్ కౌశల్, విశాఖ శాంతిభద్రతల డిసిపిగా మేరీ ప్రశాంతి, అనకాపల్లి ఎస్‌పిగా తుహిన్ సిన్హా, పిటిఒ ఎస్‌పి కెఎస్ఎస్‌వి సుబ్బారెడ్డికి పోస్టింగ్ ఇచ్చారు. అలాగే ఎన్‌టిఆర్ కమిషన రేట్‌లో క్రైమ్ డిసిపిగా తిరుమలేశ్వరరెడ్డి, ఎపిఎస్‌పి 3 బెటాలియన్ కమాండెంట్‌గా దీపక్, ఒంగోలు పిటిసి ప్రిన్సిపల్‌గా జి రాధిక, ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ ఎస్‌పిగా అరిఫ్ హఫీజ్‌లను నియమిం చారు. అలాగే బాపూజి అట్టాడ, శ్రీనివాసరావుకు పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## విశాల్ గున్నీకి తాత్కాలిక ఊరట

**ప్రజాశక్తి-అమరావతి**

నటి జత్వానీ ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు నమోదు చేసిన కేసులో ఐపిఎస్ అధికారి విశాల్ గున్నీకి హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. ఇదే తరహాలో మరో ఐపిఎస్ అధికారి దాఖలు చేసిన పిటిషన్‌తో కలిపి అక్టోబరు ఒకటిన విచారిస్తామని జస్టిస్ విఆర్ కృపాసాగర్ ప్రకటించారు. అప్పటి వరకు గున్నీపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించారు. ముందస్తు బెయిల్ కోసం అప్పటి ఎసిపి కె హనుమంతరావు పిటిషన్ దాఖలు చేశారు. జత్వానీ ఫిర్యాదులో తనపై నిర్దిష్ట ఆరోపణ ఏమీ లేవన్నారు. జత్వానీ కుటుంబాన్ని ముంబయి నుంచి తీసుకు రావడంలో గానీ, వారిపై కేసు నమోదు చేయడంలో గానీ తన ప్రమేయం ఏమీ లేదన్నారు. ఘటన ఫిబ్రవరిలో జరిగిందని, అయితే గత జనవరిలో తాను కాకినాడకు బదిలీ అయ్యానని వివరించారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేయనుంది.

**ఆ ఇద్దరు ఎమ్మెల్యేలను అరెస్టు చేయాలి**

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఫ్లెక్సీని చించిన ఉండి టిడిపి ఎమ్మెల్యే కె రఘురామ కృష్ణరాజును భర్తరఫ్ చేయాలని, అదే తరహాలో కాకినాడలో దళిత వైద్యుడు ఉమామహేశ్వరరావుపై దాడి చేసిన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీపైనా ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని హైకోర్టు న్యాయవాదులు డిమాండ్ చేశారు. హైకోర్టు ఎస్‌సి, ఎస్‌టి న్యాయవాదుల ఫోరం ఆధ్వర్యాన న్యాయవాదులు భోజన విరామ సమయంలో హైకోర్టు వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68